ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
చిత్తూరు జిల్లా వార్తలు
శుక్రవారం 6 డిసెంబరు 2024





పుంగనూరు ఏరియా ఆస్పత్రి

బెడ్స్ లేక ఖాళీగా ఉన్న గైనిక్‌వార్డు

అసంపూర్తిగా ఉన్న ఆస్పత్రి భవనాలు

పైన పటారం.. లోన లొటారం



ఆస్పత్రి లోపల దెబ్బతిన్న సన్‌షేడ్



● పుంగనూరు ఏరియా ఆస్పత్రిలో ఇదీ పరిస్థితి ● అసంపూర్తిగానే రెండో అంతస్తు భవనాలు

● డ్రైవర్ లేక నిరుపయోగంగా అంబులెన్స్ ● అప్పుడే దెబ్బతింటున్న ఆస్పత్రి భవనాలు

పుంగనూరు, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): పుంగనూరు ఏరియా ఆస్పత్రి సమస్యలతో సతమతమవుతోంది. బయట రంగులతో మెరుస్తున్నా లోపల రెండో అంతస్తు భవన నిర్మాణాలన్నీ అసంపూర్తిగానే ఉన్నాయి. అయినా వాటికి సైతం రంగులేసేశారు.ఇక సిబ్బంది కొరతతో వైద్యం సక్రమంగా అందడం లేదు.వైసీపీ ప్రభుత్వ హయాంలో నాబార్డు నిధులు రూ.5.50 కోట్లతో ఈ ఆస్పత్రిని 100 పడకల స్థాయికి మార్చారు. నూతన భవనాలు నిర్మించి గత ఏడాది అక్టోబరులో నాటి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి ప్రారంభించారు. అసంపూర్తిగా ఉన్న భవనాలనే ప్రారంభించడంతో గ్రౌండ్ ఫ్లోర్, మొదటి అంతస్తు కొంతవరకు వినియోగిస్తుండగా ఇంకా పనులు అసంపూర్తిగానే ఉన్నాయి.నిర్మాణంలో నాణ్యత లేకపోవడంతో పలుచోట్ల నెర్రెలు వచ్చాయి. కొన్నిచోట్ల పైకప్పు దెబ్బతింది. సన్‌షేడ్లు విరిగిపోయాయి. ప్రధాన గేటు వద్ద టైల్స్ విరిగిపోయాయి. మొదటి అంతస్తులో గైనిక్ వార్డు నిర్మించినా పడకలు ఏర్పాటు చేయనేలేదు. ఇక రెండో అంతస్తు మొత్తం అసంపూర్తిగా ఉంది. అలాగే పాత భవనాలు కొన్నిచోట్ల వర్షానికి ఉరుస్తున్నాయి.పైకప్పు పెచ్చులు దెబ్బతిని ప్రమాదకరంగా ఉన్నాయి.

ఖాళీగానే పలు పోస్టులు

రోజూ పుంగనూరు ఆస్పత్రికి చౌడేపల్లె, సోమల, పెద్దపంజాణి,పుంగనూరు, రామసముద్రం మండలాల నుంచి దాదాపు 300 మంది అవుట్ పేషెంట్లు, 50 మంది ఇన్‌పేషెంట్లు వస్తుంటారు. ఆస్పత్రికి ప్రభుత్వం 96 పోస్టులు మంజూరు చేయగా అందులో రెగ్యులర్ 29 మంది, కాంట్రాక్ట్ పద్ధతిలో 25 మంది, అవుట్ సోర్సింగ్ పద్ధతిలో 16 మంది పని చేస్తున్నారు. జనరల్ మెడిసిన్, అనస్తీషియా, సివిల్ సర్జన్లు, డిప్యూటీ సివిల్ సర్జన్లు, గైనకాలజిస్టు, జనరల్ మెడిసిన్, సివిల్ అసిస్టెంట్ సర్జన్లు రేడియాలజీ, పాథాలజీ విభాగాల్లో డాక్టర్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయి.అలాగే గ్రేడ్-2 నర్సింగ్ రెండు పోస్టులు, మూడు హెడ్ నర్స్, ఒక స్టాఫ్‌నర్స్, రెండు ఫార్మా సూపర్‌వైజర్, మూడు డార్క్‌రూమ్ అసిస్టెంట్ పోస్టులు, ఒక ల్యాబ్ అసిస్టెంట్, ఒక పోస్టుమార్టమ్ అసిస్టెంట్, ఆస్పత్రి పరిపాలనాధికారి, నాలుగు క్లర్క్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇక్కడికి వస్తున్న రోగులకు వైద్యులు ప్రాథమిక చికిత్స చేశాక ఎక్కువ శాతం మదనపల్లె, కోలార్, తిరుపతి ప్రాంతాలకు రెఫర్ చేస్తున్నారు. మూడేళ్ల క్రితం అంబులెన్స్ కేటాయించినా డ్రైవర్ లేకపోవడంతో అదీ నిరుపయోగంగానే ఉంది. రోడ్డుప్రమాదాల్లో గాయపడిన వారు, ప్రసవ సమయాల్లో గర్భిణులు అంబులెన్సు లేక ఇబ్బందులు పడుతున్నారు. అత్యవసర సమయాల్లో బెంగళూరు, తిరుపతి, వేలూరు, చెన్నై ఆస్పత్రులకు రోగులను తీసుకెళ్లడానికి ప్రజలు ప్రైవేటు అంబులెన్స్‌లను ఆశ్రయించాల్సి వస్తోంది.

పుత్తూరు-అత్తిపట్టు హార్బర్‌కు కొత్త రైల్వే లైన్

● 189 హెక్టార్ల భూసేకరణ పనులకు అనుమతి

పుత్తూరు, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): పుత్తూరు నుంచి తమిళనాడులోని అత్తిపట్టు కొత్త రైల్వే మార్గం కోసం భూసేకరణ పనులకు రైల్వే శాఖ అనుమతి ఇచ్చింది. 88 కిలోమీటర్ల దూరం కలిగిన ఈ రైల్వే లైనుకు 189 హెక్టార్ల భూములను సేకరించాల్సి వుంది.2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి చెన్నై రైల్వేజోన్‌లో పుత్తూరు-అత్తిపట్టుతో పాటు 185 కిలోమీటర్ల దిండివనం-తిరువణ్ణామలై,36కిలోమీటర్ల మోరంపూర్-ధర్మపురి,41 కిలోమీటర్ల మన్నార్‌గుడి-పట్టుకోట్టై, 52 కిలోమీటర్ల తంజావూరు- పట్టుకోట్టై లైన్ల భూసేకరణ పనులకు రైల్వే శాఖ అనుమతి ఇచ్చింది.చెన్నై హార్బర్‌లో ఎగుమతులు, దిగుమతుల వత్తిడి ఎక్కువ కావడంతో ప్రత్యామ్నాయంగా అత్తిపట్టు హార్బర్‌ను కేంద్రం ఎంపిక చేసింది. బళ్లారి నుంచి ఎగుమతయ్యే ఇనుప ఖనిజాన్ని భవిష్యత్తులో అత్తిపట్టు హార్బర్‌కు మళ్లిస్తారు.ఈ కొత్త రైల్వే మార్గం నారాయణవనం, పిచ్చాటూరు,నాగలాపురం మండలాల మీదుగా అత్తిపట్టుకు చేరుతుంది. ఇప్పటివరకూ ఈ మండలాల ప్రజలు పుత్తూరు స్టేషనుకు చేరుకుని రైలు ఎక్కుతున్నారు.ఈ కొత్త రైలు మార్గం రూపుదాల్చితే ఈ ప్రాంత ప్రజలకు రైలు ప్రయాణం మరింత సులభమవుతుంది.

పేరెంట్స్ మీటింగుకు రండి

ప్రజాప్రతినిధులకు ఆహ్వానం

చిత్తూరు కలెక్టరేట్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో విద్యాప్రమాణాల మెరుగు, విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాలను పెంచాలనే లక్ష్యంతో శనివారం తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో మెగా సమావేశాన్ని అన్ని పాఠశాలల్లో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామని కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. గురువారం మీడియా సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ సమావేశాల్లో పాల్గొనాలని ప్రజా ప్రతినిధులను ఆహ్వానిస్తున్నామన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో బోధనా ప్రమాణాలు పెరగడం లేదన్న అభిప్రాయం తల్లిదండ్రుల్లో ఉందని చెబుతూ అందుకోసం ప్రమాణాలను పెంచే అంశంపై తల్లిదండ్రుల నుంచి నిర్మాణాత్మకమైన అభిప్రాయాలను స్వీకరిస్తామన్నారు. ప్రతి విద్యార్థికి సంబంధించిన ప్రోగ్రెస్ రిపోర్టును తల్లిదండ్రులకు అందిస్తామని తెలిపారు. విద్యాశాఖ అధికారులతో పాటు పంచాయతీ రాజ్, జిల్లాస్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొంటారని తెలిపారు. పాఠశాలలకు మౌలిక సదుపాయాల కల్పనతో భవన సౌకర్యాలను ఏర్పాటు చేయడం జరిగిందని,ఇక మెరుగైన ఫలితాలు సాధించాల్సి ఉందన్నారు. విద్యార్థులకు అందిస్తున్న బోధన, మధ్యాహ్న భోజనం తదితరాలపై తల్లిదండ్రుల నుంచి సూచనలను స్వీకరిస్తామని చెప్పారు.

భూ సమస్యల పరిష్కారమే లక్ష్యం

● నేటినుంచి రెవెన్యూ సదస్సులు
● 45రోజుల్లోగా అర్జీలకు పరిష్కారం



చిత్తూరు కలెక్టరేట్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి):ఐదేళ్ల వైసీపీ పాలనలో రెవెన్యూ అధికారుల సహకారంతో ఆ పార్టీ నేతలు ఇష్టానుసారంగా భూఆక్రమాలకు పాల్పడ్డారు. రీసర్వే పేరుతో రైతుల భూవిస్తీర్ణంలో మార్పులు చోటు చేసుకున్నాయి. దీంతో ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే గ్రీవెన్స్ డేకి సింహభాగం అర్జీలు రెవెన్యూ సమస్యలపైనే వస్తున్నాయి. దీంతో కూటమి ప్రభుత్వం రెవెన్యూ సమస్యల్ని క్షేత్రస్థాయిలోనే పరిష్కరించడానికి ముందడుగు వేసింది. శుక్రవారం నుంచి జనవరి 8వ తేదీ వరకు గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నారు. జిల్లాలో 782 రెవెన్యూ గ్రామాలుండగా.. ప్రతి చోటా ఉదయం 9 గంటల నుంచి అధికారుల బృందం సదస్సుల్ని నిర్వహిస్తుంది. ఫ్రీహోల్డ్, 22(ఏ), డీకేటీ, రీసర్వే, మ్యుటేషన్, గ్రామాల్లో దారి సమస్యలు, రహదారుల పరిహారం తదితర సమస్యలున్న వారి నుంచి వినతుల్ని స్వీకరిస్తారు. వచ్చిన ప్రతి ఫిర్యాదుకూ రసీదులిస్తారు. తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, వీఆర్వో, సర్వేయర్లు బృందంగా మారి రోజుకో గ్రామంలో సభల్ని నిర్వహిస్తారు. అవసరమైన చోట అటవీ, దేవదాయ, వక్ఫ్‌బోర్డు, రిజిస్ట్రేషన్ శాఖల సిబ్బంది కూడా హాజరుకానున్నారు. జేసీ విద్యాధరి ఈ సదస్సుల నిర్వహణకు జిల్లా సమన్వయకర్తగా పనిచేస్తారు. ఏయే గ్రామాల్లో ఎప్పుడు సభల్ని నిర్వహిస్తున్నామనే సమాచారాన్ని ముందస్తుగానే ప్రజలకు దండోరా ద్వారా తెలియజేస్తారు. గ్రామ పంచాయతీ కార్యాలయం, పాఠశాల, వెలుగు కార్యాలయం, పీహెచ్‌సీలలో ముందస్తుగా సదస్సుల వివరాల్ని ప్రదర్శిస్తారు. అలాగే స్థానిక ప్రజాప్రతినిధులు హాజరయ్యేందుకు వారికి కూడా సమాచారం ఇచ్చారు. జిల్లాలో 33 రోజుల పాటు జరిగే ఈ సదస్సుల్లో 30 నుంచి 40 వేల దరఖాస్తులు రావచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. జనవరి 8వ తేదీన సదస్సులు ముగిస్తే.. అప్పటి నుంచి 45 రోజుల్లోగా వచ్చిన దరఖాస్తుల్ని పరిష్కరించేలా తహసీల్దార్లు చర్యలు తీసుకోవాల్సి ఉంది. వైసీపీ హయాంలో జరిగిన రీసర్వే సమస్యల్ని పరిష్కరించేందుకు ఇటీవల 392 గ్రామాల్లో 'రీసర్వే, రెవెన్యూ గ్రామ సభ'ల్ని నిర్వహించిన విషయం తెలిసిందే. అందులో సుమారు 15వేల దరఖాస్తులు వచ్చాయి. అవన్నీ పరిష్కార దశలో ఉన్నాయి.

రైతులు సద్వినియోగం చేసుకోవాలి: కలెక్టర్

రెవెన్యూ సదస్సులను భూ సమస్యలున్న రైతులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ కోరారు. సదస్సుల ద్వారా అందే ఫిర్యాదులను సంబంధిత పోర్టల్‌లోకి అప్‌లోడ్ చేస్తామన్నారు. నోడల్ అధికారిగా ఉన్న జిల్లా స్థాయి అధికారులు, ఆర్డీవోలు, సదస్సుల నిర్వహణను పర్యవేక్షిస్తారన్నారు.రిజిస్ట్రేషన్, సర్వే, అటవీ, దేవదాయ శాఖల అధికారులతో సమావేశమైన డీఆర్వో మోహన్ కుమార్ సదస్సుల నిర్వహణ విధి విధానాలపై సూచనలిచ్చారు.మ్యుటేషన్, ఎల్ఈసీ, భూ సమస్యలు, భూ కబ్జా,భూ రికార్డుల తారుమారు, రెవెన్యూ అంశాలతో పాటు రెవెన్యూయేతర అంశాలపై వినతులను స్వీకరిస్తామని చెప్పారు. దేవదాయశాఖ ప్రతినిధి సదస్సులకు ఆ శాఖ భూములకు సంబంధించిన ఆస్తుల వివరాలతో కూడిన రిజిస్టర్‌తో హాజరుకావాలన్నారు.

8న కృత్రిమ కాలుకు కొలతలు

చిత్తూరు అర్బన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు, తిరుపతి జిల్లాల్లోని విభిన్న ప్రతిభావంతుల్లో అవసరమైన వారికి ఈనెల 8న తపోవనంలో కృత్రిమ కాలుకు కొలతలు తీసుకోనున్నారు. ఈ మేరకు విభిన్న ప్రతిభావంతుల శాఖ ఏడీ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. 20 రోజుల తర్వాత ఆధునిక వెయిట్‌లెస్ కృత్రిమ కాలు ఉచితంగా అమర్చుతామన్నారు. అవసరమైన వారు సహాయ సంచాలకులు, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమశాఖ, నూతన కలెక్టరేట్ భవనం, అంబేడ్కర్ భవన్, చిత్తూరు అనే చిరునామాలో సంప్రదించాలని కోరారు. వివరాలకు 94403 57522 నెంబరుకు ఫోన్ చేయాలన్నారు.

13 మండలాల్లో వర్షం

చిత్తూరు అర్బన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా గడిచిన 24 గంటల్లో 13 మండలాల్లో తేలికపాటి నుంచి బలమైన వర్షం కురిసింది. గుడుపల్లెలో అత్యధికంగా 49.2, పెనుమూరులో అత్యల్పంగా 0.2 మి.మీ వర్షపాతం నమోదైంది. మండలాల వారీగా.. శాంతిపురంలో 43.2, కుప్పంలో 41, విజయపురంలో 12.6, పులిచెర్లలో 12, కార్వేటినగరలో 10.4, రామకుప్పంలో 8.2, రొంపిచెర్లలో 6.8, నగరిలో 3.8, నింద్రలో 2.6, పూతలపట్టులో 2, సదుంలో ఒక మి.మీ వర్షం కురిసింది.

గఘన విజయం

● పీఎస్ఎల్వీ-సీ 59 ప్రయోగ విజయంతో షార్‌లో సంబరాలు
● వాణిజ్యపరమైన ప్రయోగాల్లో మరోసారి సత్తా చాటిన ఇస్రో




నిప్పులు చెరుగుతూ నింగిలోకి..


గురువారం సాయంత్రం 4.04 గంటలు.తిరుపతి జిల్లా శ్రీహరికోటలోని షార్‌లో మొదటి ప్రయోగ వేదిక నుంచి నిప్పులు చెరుగుతూ పీఎస్ఎల్వీ-సీ 59 రాకెట్ నింగికెగిసింది. నాలుగో దశలో రాకెట్ నుంచి విడిపోయిన ప్రోబా-3 ఉపగ్రహం.. నిర్ణీత కక్ష్యలోకి చేరింది. దీనికి పట్టిన సమయం 18.40 నిమిషాలు. అప్పటి వరకు ఉత్కంఠగా చూస్తున్న శాస్త్రవేత్తల్లో ఆనందానికి అవధుల్లేకుండా పోయింది.సహచర శాస్త్రవేత్తలను ఇస్రో చైర్మన్ సోమనాథ్ అభినందించారు. ఈ విజయంతో వాణిజ్యపరమైన ప్రయోగాల్లో ఇస్రో మరోసారి సత్తా చాటింది. ఆదిత్య-ఎల్1 తరహాలోనే విదేశానికి చెందిన ప్రోబా-3 ఉపగ్రహాన్ని సూర్యుడి బాహ్యావలయం కరోనాపై పరిశోధనలు చేసేందుకు విజయవంతంగా ఇస్రో ప్రయోగించింది. బుధవారం సాయంత్రం జరగాల్సిన ఈ ప్రయోగం ఉపగ్రహంలో సాంకేతిక లోపంతో చివరి గంటలో వాయిదా పడింది. దీనిని సరిచేసి గురువారం సాయంత్రం పీఎస్ఎల్వీ-సీ 59 వాహక నౌకను విజయవంతంగా ప్రయోగించారు.

ఆకాశమే హద్దుగా..


వాణిజ్యపరమైన ప్రయోగాల్లో ఆకాశమే హద్దుగా ఇస్రో దూసుకెళ్తోంది. శ్రీహరికోట రాకెట్ కేంద్రం భూమధ్య రేఖకు 13 డిగ్రీల అక్షాంశంలో ఉండటంతో గ్రావిటీ పవర్ తక్కువగా ఉంటోంది. అందుకే ఇక్కడ వాణిజ్యపరమైన ప్రయోగాలకు తక్కువ ఖర్చవుతోంది. దీంతో చాలా దేశాలు న్యూస్పేస్ ఇండియాతో ఒప్పందాలు చేసుకుంటున్నాయి. రెండు టన్నులకు మించి బరువున్న ఉపగ్రహాలను ఫ్రాన్స్, రష్యా అంతరిక్ష కేంద్రాల నుంచి పంపుతున్నారు. అతి చిన్న విదేశీ ఉపగ్రహాలను పీఎస్ఎల్వీ ద్వారా పంపడం ద్వారా వాణిజ్యపర ప్రయోగాలకు ఇస్రో కేరాఫ్ అడ్రస్‌గా నిలుస్తోంది. ఇప్పటి దాకా 61 పీఎస్ఎల్వీ ప్రయోగాలు చేపట్టి అత్యధిక విదేశీ ఉపగ్రహాలు ప్రయోగించి ప్రపంచ దృష్టిని ఆకర్షించింది. మరో 8 దేశాల ఉపగ్రహాలను ప్రయోగించేందుకు ఎంవోయూ చేసుకొంది. దీంతో ఏడాదికి రూ.వెయ్యి కోట్లకుపైగా వాణిజ్యపరంగా ఆదయాన్ని ఆర్జిస్తోంది. తాజాగా యూరోపియన్ స్పేస్ ఏజెన్సీకి చెందిన ప్రోబా-3 ఉపగ్రహాన్ని పీఎస్ఎల్వీ-సీ 59 ద్వారా ప్రయోగించి మరో విజయాన్ని సొంతం చేసుకొంది.



ప్రయోగంలో రెండో దశ



మూడో దశ



నాలుగో దశలో రాకెట్ నుంచి విడిపోతున్న ఉపగ్రహం



ప్రయోగాన్ని వీక్షిస్తున్న ఇస్రో చైర్మన్ సోమనాథ్



పిలమర్రై కల్లర్ కులానికి బీసీ గుర్తింపు ఇవ్వాలని వినతి


సీఎం చంద్రబాబుకు వినతిపత్రం ఇస్తున్న పిలమర్రై కల్లర్ సంఘం నాయకులు

కుప్పం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పిలమర్రై కల్లర్ కులాన్ని గుర్తించి బీసీ సర్టిఫికెట్ మంజూరు చేయాలని ఆ కుల సంఘం నాయకులు ముఖ్యమంత్రి చంద్రబాబును కోరారు. పిలమర్రై కల్లర్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఈశ్వర్ తేవర్, ఎంబీసీ రాష్ట్ర అధ్యక్షుడు పూసల రవి, జిల్లా ఎంబీసీ ఉపాధ్యక్షుడు, టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యదర్శి శివ తేవర్, రాజా, తంగ పండియన్ తేవర్‌లు అమరావతిలో గురువారం ముఖ్యమంత్రిని కలిశారు. గతంలో 8ఏళ్ల నుంచి బీసీ కమిషన్ ఛైర్మన్, అన్ని జిల్లాలలో చేసిన సర్వే పత్రాలను ఆయనకు చూపించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ తమ కులం సంచార జాతులకు చెందిందన్నారు. ఊరూరా తిరుగుతూ తినుబండారాలు అమ్ముకుని జీవనం సాగిస్తున్నామన్నారు. కులధ్రువీకరణ పత్రం మంజూరు చేయకపోవడంతో పిల్లల భవిష్యత్తుకు నష్టం వాటిల్లుతున్నదన్నారు స్పందించిన చంద్రబాబు సానుకూలంగా స్పందించారని సంఘం నాయకులు తెలిపారు.

మాజీ ఎంపీపీ మధుసూదన్‌రెడ్డికి నివాళి


మధుసూదన్‌రెడ్డి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న నేతలు

కల్లూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండల కేంద్రంలోని బీవీరెడ్డి బంగళా ఆవరణలో గురువారం మాజీ ఎంపీపీ,పారిశ్రామికవేత్త వారణాశి మధుసూదన్‌రెడ్డి వర్ధంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు శ్రీనివాసులురెడ్డి, ధనంజయనాయుడు మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాలకు వారణాశి కుటుంబం ఉచితంగా స్థలాలు ఇచ్చిందన్నారు. అనంతరం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మిఠాయిలు పంచిపెట్టారు. వారణాశి నచికేతన్‌రెడ్డి, టీడీపీ నాయకులు నజీర్, యల్లారెడ్డి, శంకర్, మధుసూదన్‌రెడ్డి, రమేష్, బాబురెడ్డి పాల్గొన్నారు.

ఓవర్‌హెడ్ ట్యాంకుల మరమ్మతులు ప్రారంభం


మరమ్మతు పనుల ప్రారంభోత్సవంలో ఎమ్మెల్సీ కంచర్ల

రామకుప్పం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): చంద్రబాబు కుప్పం ఎమ్మెల్యేగా ఎన్నికయ్యాక నియోజకవర్గం రూపురేఖలు పూర్తిగా మారిపోయాయని శాసన మండలి విప్ కంచర్లశ్రీకాంత్ అన్నారు. నియోజకవర్గంలో రూ.4.75కోట్లతో 110 తాగునీటి ఓవర్‌హెడ్ ట్యాంకుల మరమ్మతు పనులను ఆయన గురువారం రామకుప్పంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2017లో సీఎంగా చంద్రబాబు నియోజకవర్గంలో తాగునీటి ట్యాంకుల మరమ్మతులకు నిధులు మంజూకరు చేశారన్నారు. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఆ పనులను చేపట్టకుండా ప్రజలను ఇబ్బందులకు గురిచేసిందన్నారు. ఈఏడాది చంద్రబాబు సీఎం అయ్యాక మరమ్మతుల కోసం వెంలనే నిధులు మంజూరు చేశారన్నారు. కార్యక్రమంలో ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి. బీసీసెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పట్రనారాయణాచారి, ఆనందరెడ్డి, నరసింహులు, ఆంజినేయరెడ్డి, చిన్నికృష్ణ, చలపతి, వెంకటాచలం, అధికారులు పాల్గొన్నారు.

భవనాలను వినియోగంలోకి తెచ్చేందుకు చర్యలు

రామకుప్పం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): రామకుప్పంలో జీర్ణదశకు చేరుకున్న పాత పీహెచ్‌సీ భవనాన్ని గురువారం శాసనమండలి విప్ కంచర్ల శ్రీకాంత్‌పరిశీలించారు. అపరిశుభ్రతను చూసి ఆవేదన వ్యక్తం చేశారు. దీని స్థానంలో కొత్త భవనాన్ని నిర్మించి ప్రభుత్వ కార్యాలయానికి వాడుకునేలా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని తహశీల్దారు బాబు, ఎంపీడీఓ లక్ష్మీకాంత్‌లను ఆయన ఆదేశించారు. నియోజకవర్గంలో నిరుపయోగంగా ఉన్న అన్ని ప్రభుత్వ భవనాలను గుర్తించి, వాటిని వినియోగంలోకి తీసుకురావడానికి తీసుకోవాల్సిన చర్యలపై క్షేత్రస్థాయి అధికారుల నుంచి వివరాలు సేకరించి, ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని ఈ సందర్భంగా మండల స్థాయి అధికారులకు ఈ సందర్భంగా ఆయన సూచించారు. భవిష్యత్తులో ఏ ప్రభుత్వ భవనం నిరుపయోగంగా ఉండరాదన్నారు. ఆయన వెంట పార్టీ నాయకులు పాల్గొన్నారు.

నీట మునిగిన పొలాల పరిశీలన


దిడ్డివారిపల్లెలో వరి పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

సోమల, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఫెంగల్ తుఫాన్ ప్రభావంతో నీట మునిగిన వరి పొలాలను గురువారం ఏరువాక శాస్త్రవేత్త సంధ్యారాణి, తిరుపతి వ్యవసాయ పరిశోధన శాస్త్రవేత్తలు వసంత, హరితలు గన్నావారిపల్లె, సోమల, మఠంగొల్లపల్లె తదితర ప్రాంతాల్లో సందర్శించారు. రైతులకు పలు సూచనలు చేశారు. ఉప్పు ద్రావకాన్ని పిచికారీ చేయాలన్నారు. వర్షం ఆగిన తరువాత టమోటా కోయాలన్నారు. పంట నష్ట పోయిన రైతులకు ప్రభుత్వం తరఫున నష్ట పరిహారం మంజూరుకు ప్రతిపాదనలు పంపుతున్నట్లు తెలిపారు. రైతు సేవా కేంద్రం ప్రతినిధులు జ్యోతి, వనజ, కుమార్ రైతులు పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ విజేతగా మర్రిమాకులపల్లెజట్టు


మర్రిమాకులపల్లె హైస్కూల్ విద్యార్థులు

చౌడేపల్లె, డిసెంబరు5:(ఆంధ్రజ్యోతి): మర్రిమాకులపల్లె హైస్కూల్ విద్యార్థులు ఫుట్‌బాల్ విజేతలుగా విజేతలుగా నిలిచారు. నియోజకవర్గ జోనల్ క్రీడల్లో భాగంగా గురువారం మర్రిమాకులపల్లె హైస్కూల్‌లో జరిగిన బాలుర విభాగం సీనియర్, జూనియర్ ఫుట్‌బాల్ పోటీల్లో ఈ విద్యార్థులు విజేతలుగా నిలిచారు. సీనియర్, జూనియర్ విభాగాల్లో నాలుగు జట్లు వంతుల తలపడ్డాయి. చంద్రమాకులపల్లె హైస్కూల్ విద్యార్థులు సీనియర్, జూనియర్‌లో రన్నర్స్‌గా నిలిచారు. గెలుపొందిన క్రీడాకారులను హెచ్‌ఎం నాధమునినాయుడు, పీడీ పవన్, ఉపాధ్యాయులు అభినందించారు.

రాష్ట్ర సాయి త్రోబాల్ పోటీలకు ఎంపిక

సోమల, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి త్రోబాల్ పోటీలకు సోమల మండలంలోని పలువురు విద్యార్థులు ఎంపిక జరిగినట్లు ఎంఈవో శివరత్న తెలిపారు. జిల్లా స్థాయి త్రోబాల్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన సోమల హైస్కూల్ విద్యార్థులు ముబారక్, హేమనిధి, సూరయ్యగారిపల్లె హైస్కూల్ విద్యార్థులు అనీషా, మహావిష్ణువర్ధన్, కందూరు హైస్కూల్‌కు చెందిన హేమలత, లికిత, రెడ్డిపవన్ ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారన్నారు. వీరిని ఆయా పాఠశాల హెచ్‌ఎంలు హరినాథ్, నిరంజన్‌కుమార్, వెంకటరమణారెడ్డిలు పీడీలు చిన్నప్ప, కరుణానిధి, శివకుమార్, ఉపాధ్యాయులు గురువారం అభినందించారు.

నేటి నుంచి భూవివాదాలపై అర్జీల స్వీకరణ: ఆర్డీవో

పలమనేరు, డిసెంబరు5 (ఆంధ్రజ్యోతి) : శుక్రవారం నుంచి రెవెన్యూ గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఆర్డీఓ భవానీ తెలిపారు. గ్రామాల్లో సదస్సులు జనవరి 8 వరకు నిర్వహించి భూవివాదాల అర్జీలు స్వీకరిస్తున్నట్లు పేర్కొన్నారు. రెవెన్యూ, వక్ఫ్, ఎండోమెంట్, ఫారెస్టు, రిజిస్ట్రేషన్, స్టాంప్ అధికారులు కూడా పాల్గొంటారన్నారు. ప్రతిరోజు ఉదయం 9నుంచి సాయంత్రం 5వరకు జరుగుతాయని వివరించారు.

నేడు గొరివిమాకులపల్లె రెవెన్యూ సదస్సుకు కలెక్టరు

రామకుప్పం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): గొరివిమాకులపల్లెలో శుక్రవారం నిర్వహించనున్న రెవిన్యూ సదస్సులో జిల్లా కలెక్టరు సుమిత్‌కుమార్ పాల్గొంటారని తహశీల్దారు బాబు తెలిపారు. మ్యూటేషన్, రీసర్వే, 22ఏ, ఆర్వోఆర్ ల్యాండ్‌గ్రాలింగ్, ఫ్రీహోల్డ్ అసైన్‌మెంటు తదితర సమస్యలపై రైతుల నుంచి వినతి పత్రాలను స్వీకరిస్తారన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

రోడ్డుప్రమాదంలో యువకుడి మృతి

భైరెడ్డిపల్లె, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): భైరెడ్డిపల్లె-పలమనేరు ప్రధానరహదారిలో గురువారం జరిగిన రోడ్డుప్రమాదంలో చరణ్(26) అనే యువకుడు మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. కమ్మనపల్లెకు చెందిన చరణ్ పలమనేరు నుంచి ద్విచక్రవాహనంలో స్వగ్రామానికి వెళుతుండగా అయ్యప్ప భక్తులతో శబరిమలైకు వెళుతున్న ఇన్నోవా వాహనం కమ్మనపల్లె క్రాస్‌వద్ద ఢీకొంది. తీవ్రంగా గాయపడిన చరణ్‌ను వెంటనే పలమనేరు ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పరశురాముడు తెలిపారు.

కారు ఢీకొని ఒకరి దుర్మరణం


మృతిచెందిన చంద్రశేఖర్

గంగవరం,డిసెంబరు05,(ఆంధ్రజ్యోతి): పలమనేరు- బెంగళూరు రహదారిలో జీయల్‌యస్ ఫారం ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొన్న ఘటనలో చంద్రశేఖర్ (57) అనే వ్యక్తి మృతిచెందాడు. పోలీసుల కథనం మేరకు... పలమనేరు మండలం మొరం పంచాయతీ రాజీవ్‌నగర్ కాలనీకి చెందిన చంద్రశేఖర్ సమీపంలోని షీప్ సొసైటీలో కాంట్రాక్టు ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. ఈక్రమంలో గురువారం ఉదయం డ్యూటీ ముగించుకొని ద్విచక్రవాహనంపై ఇంటికి వెళ్తుండగా పలమనేరు వైపు వస్తున్న కారు వెనుక నుంచి ఢీకొంది. తీవ్రంగా గాయపడిన చంద్రశేఖర్ అక్కడికక్కడే మృతిచెందాడని అర్బన్ సీఐ ప్రసాద్ తెలిపారు.

మూర్ఛ బాధితునికి తీవ్రగాయాలు

పుంగనూరు రూరల్, డిసెంబరు5(ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనం అదుపు తప్పి బోల్తా పడి ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలు... కర్నాటక రాష్ట్రం ముళబాగళ్ తాలూకా హెబ్బినికి చెందిన సుబ్రహ్మణ్యం ద్విచక్రవాహనంలో గురువారం పుంగనూరు వస్తున్నాడు. పుంగమ్మ చెరువు కట్టపై మూర్ఛ రావడంతో కిందపడ్డాడు. తీవ్రంగా గాయపడిన సుబ్రహ్మణ్యం పరిస్థితి విషమంగా ఉండటంతో మదనపల్లె ఆసుపత్రికి తరలించారు.

సేంద్రియ ఎరువుల వాడకంతో అధిక దిగుబడి

పుంగనూరు రూరల్, డిసెంబరు5(ఆంధ్రజ్యోతి): సేంద్రియ ఎరువులు వాడకం వల్ల అధిక దిగుబడి పొందవచ్చునని ఏడీఏ శివకుమార్‌రాజు పేర్కొన్నారు. ప్రపంచ మృత్తికా దినోత్సవం సందర్భంగా గురువారం చదళ్ల రైతు సేవా కేంద్రంలో జరిగిన రైతుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సేంద్రియ ఎరువులు, పచ్చిరొట్టు ఎరువుల వాడకం వల్ల నేలలో తేమ సామర్థ్యం పెరుగుతుందన్నారు. ఈ ఆహారం తిన్న వారు ఆరోగ్యవంతులుగా ఉంటారన్నారు. రసాయనిక ఎరువులు వాడకం వల్ల నేల నిస్సారమై కోతకు గురివుతుందన్నారు. సమావేశంలో ఏవో జ్యోతి, వీఎస్‌ఏ ఆనంద్, సంధ్యరాణి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం గదిపై ఏనుగు దాడి


ఏనుగు తినగా మిగిలిన ధాన్యం

పలమనేరు, డిసెంబరు5 (ఆంధ్రజ్యోతి): బండిండ్లు సమీపంలో బుధవారం రాత్రి విజయన్ అనే రైతుకు చెందిన ధాన్యాన్ని ఏనుగు తిని వెళ్లిపోయింది. ధాన్యాన్ని పొలం వద్ద గదిలో రైతు భద్రపరచి ఇంటికి వెళ్లాడు. గురువారం ఉదయం వచ్చి చేశాడు. ఏనుగు కిటికీ పగులగొట్టి గదిలో చొరబడి ధాన్యంలో కొంతమేర తినివెళ్లినట్లు గుర్తించాడు. అంతకుముందే ఇక్కడ ఓ ఏనుగు సంచరించడాన్ని కొందరు రైతులు గుర్తించారు. ఒంటరి ఏనుగు తమ పంటలను తొక్కి నాశనం చేసిందని బాధిత రైతులు లబోదిబోమంటున్నారు. తదుపరి గదిలో ఉంచిన ధాన్యాన్ని తిని వెళ్లిపోయినట్లు విజయన్ గుర్తించాడు.

మున్సిపాలిటీలో ముఖ్యమైన సీట్లన్నీ ఖాళీ

● భర్తీ కాని ప్రధాన పోస్టులు

● సమస్యలతో ప్రజలు అవస్థలు


పుంగనూరు మున్సిపల్ కార్యాలయం

పుంగనూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్యాలయంలో ప్రధాన అధికారుల పోస్టులు భర్తీకాక ప్రజలు అవస్థలు పడుతున్నారు. 60వేలకు పైగా జనాభా ఉన్న మున్సిపాలిటీలో రెగ్యులర్ అధికారులు లేక ఇబ్బందిగా ఉంది. రెండునెలల క్రితం ఇక్కడి నుంచి పలువురు అధికారులు బదిలీ అయ్యారు. వారి స్థానాలు భర్తీ కాలేదు. ఫలితంగా క్షేత్రస్థాయిలో పనుల పర్యవేక్షణ జరగడంలేదు. ఎన్విరాన్‌మెంట్ ఏఈఈ కృష్ణవేణి ఇన్‌చార్జి ఏఈఈగా వ్యవహరిస్తున్నారు. మున్సిపల్ శానిటరీ విభాగం ఇన్‌స్పెక్టర్ పోస్టులో ఎవరినీ నియమించలేదు. పారిశుధ్య పర్యవేక్షణకు రెగ్యులర్ అధికారి అవసరం. రెండు నెలలుగా ఈ పోస్టు ఖాళీగా ఉంది. టౌన్ ప్లానింగ్ విభాగంలో సర్వేయర్ పోస్టు చాలా కాలంగా ఖాళీగా ఉంది. అలాగే ఆర్వో పోస్టుఖాళీగానే ఉంది. ఇన్‌చార్జి ఆర్వోగా మున్సిపల్ మేనేజర్ వ్యవహరిస్తున్నారు. మున్సిపల్ కార్యాలయానికి అనుసంధానంగా ఉండే మెప్మా సీఎంఎం మధుసూదన్‌రెడ్డి కొత్త ప్రభుత్వం రాగనే సెలవుపై వెళ్లి తర్వాత బదిలీ అయ్యారు. తిరుపతి నుంచి ఒకరు వచ్చినా 15 రోజులు పనిచేసి వెళ్లిపోయారు. జిల్లా అధికారులు స్పందించి కీలక పోస్టుల భర్తీకి చర్యలు తీసుకోవాలి.

ఉపాధి హామీ పనుల తనిఖీ ప్రజావేదిక వాయిదా

అధికారుల తీరుపై టీడీపీ నేతల అసంతృప్తి


ప్రజావేదికలో అధికారులను నిలదీస్తున్న టీడీపీ నేతలు

శాంతిపురం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన ఉపాధి హామీ సామాజిక తనిఖీ ప్రజావేదిక అర్ధాంతరంగా వాయిదా పడింది. ఉదయం డీఆర్‌డీఏ పీడీ రవికుమార్, డీవీఓ శివయ్య, ఏపీడీ వెంకటరత్నంలు ప్రజావేదిక నిర్వహించేందుకు ఉద్యుక్తులయ్యారు. 2023 ఏప్రిల్ 1 నుంచి ఈ ఏడాది మార్చి వరకు ఉపాధి హామీ పథకం పనులపై నిర్వహించిన సామాజిక తనిఖీ వివరాలను విన్పించేందుకు సిద్ధమయ్యారు. ఇంతలో అక్కడకు చేరుకున్న టీడీపీ మండల అధ్యక్షుడు విశ్వనాథనాయుడు, మాజీ వైస్ఎంపీపీ ఉదయ్‌కుమార్, గుంజార్లపల్లె సర్పంచు విజయరామిరెడ్డి తదితర టీడీపీ నేతలు అధికారుల తీరు పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. కూలీలు, లబ్ధిదారులు లేకుండా, అక్రమాలకు పాల్పడిన సిబ్బందితో ప్రజావేదిక నిర్వహించడమేమిటని వారు అధికారులను నిలదీశారు. వైసీపీ నేతలకు వత్తాసు పలికిన సిబ్బందిని కాపాడేందుకు ప్రయత్నించడం దారుణమన్నారు. . చివరకు ప్రజావేదికను వాయిదా వేస్తున్నట్లు అధికారులు ప్రకటించి నిష్క్రమించారు.

జాబ్‌మేళాకు 127 మంది ఎంపిక


అభ్యర్థులనుద్దేశించి ప్రసంగిస్తున్న ఎమ్మెల్సీ కంచర్ల

కుప్పం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి కార్పొరేషన్ ఆధ్వర్యంలో కుప్పంలోని టీడీపీ కార్యాలయంలో గురువారం జాబ్‌మేళా నిర్వహించారు. దీనికి ఎమ్మెల్సీ కంచర్ల, పీఎస్‌ఎంలు హాజరయ్యారు. రాష్ట్రంలోని నిరుద్యోగితను రూపుమాపడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు కంకణం కట్టుకున్నారని వీరు చెప్పారు. కాగా జాబ్ మేళాకు 256 మంది హాజరు కాగా వీరిలో 127 మంది ఎంపికయ్యారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ డాక్టర్ వెంకటేశ్, స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆఫీసర్ గుణశేఖర్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ చైతన్య, టీడీపీ నాయకులు, నిరుద్యోగ యువత పాల్గొన్నారు.

ఉపాధ్యాయునిపై దాడి దారుణం: ఎస్టీయూ


పాఠశాల ముందు నిరసన వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయులు

పుంగనూరు రూరల్, డిసెంబరు5(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా రాయచోటి జిల్లా కొత్తపల్లె జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల ఉపాధ్యాయుడు ఎజాజ్‌అహ్మద్‌పై దాడి దారుణమని జిల్లా ఎస్టీయూ సంఘ ప్రధాన కార్యదర్శి మోహన్‌యాదవ్ ఖండించారు. గురువారం స్థానిక ఎమ్మార్సీ కార్యాలయం ముందు ఉపాధ్యాయులు నిరసన తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దాడి నేపథ్యంలో ఉపాధ్యాయుడు మనోవేదనతో మృతి చెందినట్లు వారు పేర్కొన్నారు. ఆయన మృతికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎఫ్‌ఏఎఫ్‌టివో నాయకుఉల శ్రీధర్, సుధాకర్, లింగమూర్తి, బుడ్డన్న, మాధురి, రెడ్డెమ్మ, తదితరులు పాల్గొన్నారు.

మెలకువలు పాటిస్తే అధిక దిగుబడులు

వి.కోట, డిసెంబరు 5: బంగాళదుంప సాగులో రైతులు మెళకువలు పాటిస్తే అధిక దిగుబడులు సాధ్యమని జిల్లా ఉద్యానశాఖాధికారి డాక్టర్ మధుసూదన్‌రెడ్డి అన్నారు. గురువారం ఓగు పరిసరాల్లో సాగవుతున్న బంగాళదుంప తోటలను రైతులతో కలసి పరిశీలించారు. ఆకుమాడు తెగుళ్ళ ఉధృతి నివారణకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. రబీలో టమోటాకు బీమా చేసుకోవాలన్నారు. వి.కోట నిర్మితమవుతున్న కూరగాయల సేకరణ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. హెచ్‌వో లక్ష్మీప్రసూన, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

బాలింతలకు బేబీ కిట్ల పంపిణీ



వి.కోట, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): వి.కోట సీహెచ్‌సీలో బాలింతలకు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ధీరజ్ నేతృత్వంలో బేబీ కిట్లను పంపిణీ చేశారు. ప్రతి నెలా 5వ తేదిన అంతర్జాతీయ సేవా సంస్థ లయన్స్ క్లబ్ సేవా కార్యక్రమాలు చేపడుతోంది. ఈక్రమంలో గురువారం ఉదయం ప్రభుత్వాసుపత్రిలో బాలింతలకు అల్పాహారం, పాలు, రొట్టెలు, అల్పాహారం అందించారు. కార్యక్రమంలో లయన్స్ సభ్యులు కార్యదర్శి మురుగేష్, సభ్యులు బాలగురునాథ్, లక్ష్మణ్, కృష్ణమూర్తి, కేశవరెడ్డి, రవి, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దళవాయి చెరువు కట్ట పరిశీలన

సోమల, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): నంజంపేట సమీపంలోని బుధవారం తెగిపోయిన దళవాయి చెరువుకట్టను గురువారం ఇరిగేషన్, ఆర్‌అండ్‌బీ అధికారులు పరిశీలించారు. నంజంపేట-పొదలకుంటపల్లె మార్గంలో రాకపోకలపై అధికారులు సమీక్షించారు. తాత్కాలికంగా రోడ్డు పనులు చేపట్టాలని ప్రతిపాదించారు. జీడిరేవుల వంకపై కల్వర్టు పనులను కూడా ప్రతిపాదించారు. ఇరిగేషన్ ఈఈ వీఎన్‌పీ గిరి, డీఈ ప్రసాద్, మండల టీడీపీ అధ్యక్షుడు సుబ్రమణ్యంనాయుడు, అష్రఫ్ అలీ, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

అందరూ సేవాగుణం అలవర్చుకోవాలి


సమావేశంలో మాట్లాడుతున్న రామచంద్రారెడ్డి

పుంగనూరు, డిసెంబరు5(ఆంధ్రజ్యోతి): ప్రజలకు సేవ చేసే గుణాలను ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని మానవత స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకుడు రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. గురువారం గూడూరుపల్లె సమీపంలోని సంస్థ నూతన భవనాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోనే పుంగనూరు భవనాన్ని నిర్మించి సంస్థ ఆదర్శంగా నిలచిందని కొనయాడారు. ఫ్రీజర్లు, వైకుంఠ రథం ఉంచడానికి షెడ్లు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. దాతల సహకారంతో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడానికి సహకారం అందిస్తామన్నారు. సమావేశంలో ప్రతినిధులు నందీశ్వరయ్య, డాక్టర్లు ప్రభాకర్, విజయకుమారి, నానబాల గణేశ్, హరినాథ్‌రెడ్డి, ఉదయ్‌కుమార్, పూల త్యాగరాజు, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చెరువు కాలువకు గండి

● పూడ్చివేత పనుల్లో బోల్తా పడిన ట్రాక్టర్


ట్రాక్టర్‌ను తీస్తున్న దృశ్యం

కల్లూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం నన్నూరివారిపల్లి పంచాయతీ కుమ్మరిపల్లి సమీపంలో వెదర్లచెరువు కాలువకు గురువారం గండి పడింది. సమీప గ్రామాల ప్రజలు వెంటనే చేరుకొని మరమ్మతులు చేపట్టారు. ట్రాక్టర్‌లో ఇసుకబస్తాలు, గుళ్లను తరలించారు. ఈ క్రమంలో గట్టుపై ఉన్న ట్రాక్టర్ ట్రాలీతో సహా ప్రమాదవశాత్తు కాలువలో బోల్తా పడింది. డ్రైవర్ చాకచక్యంగా ట్రాక్టర్‌పై నుంచి కిందకు దూకేయడంతో ప్రమాదం తప్పింది. అనంతరం జేసీబీ సాయంతో ట్రాక్టర్‌ను వెలికితీశారు.

ఘనంగా దివ్యాంగుల దినోత్సవం


బహుమతులు అందజేస్తున్న ఎంఈవోలు కేశవరెడ్డి, తిరుమలమ్మ

చౌడేపల్లె, డిసెంబరు5:(ఆంధ్రజ్యోతి): స్థానిక భవిత కేంద్రంలో గురువారం దివ్యాంగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎంఈవో కేశవరెడ్డి మాట్లాడుతూ..దివ్యాంగుల అభివృద్ధికి ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రత్యేక ప్రతిభావంతులైన విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఎంఈవో తిరుమలమ్మ, హెచ్‌ఎం జగన్మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తెలుగుదేశం పార్టీలో శాశ్వత సభ్యత్వం స్వీకరణ

పుంగనూరు, డిసెంబరు5(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎల్ఐసీ కాలనీకి చెందిన ఆర్వీటీ బాబు(నగేశ్‌బాబు)టీడీపీలో శాశ్వత సభ్యత్వం తీసుకున్నారు. గురువారం టీడీపీ రాష్ట్ర కార్యాలయానికి రూ. లక్ష చెక్కును అందజేసి శాశ్వత సభ్యత్వం తీసుకున్నట్లు ఆయన తెలిపారు.

రేపు మెగా టీచర్ల,పేరెంట్ల సమావేశం

రొంపిచెర్ల,డిశంబరు 5 (ఆంధ్రజ్యోతి) రొంపిచెర్ల బాలుర, బాలికల, ఉర్దూ, కేజీబీవీ పాఠశాలల్లో ఈనెల 7న పేరెంట్స్ టీచర్ల సమావేశాలు పండుగ వాతావరణంలో నిర్వహించాలని సర్పంచ్ ఆర్.ఇబ్రహీంఖాన్ ఆకాంక్షించారు. గురువారం కేజీబీవీ ఉపాధ్యాయులు ఆయనకు ఆహ్వాన పత్రిక అందజేశారు.

ఏనుగుల కట్టడికి వినూత్న ఆలోచన

● ఇంజనీరింగ్ విద్యార్థిని చొరవ


ఎమ్మెల్యే అమరనాథరెడ్డికి వివరిస్తున్న రజని

పలమనేరు, డిసెంబరు5(ఆంధ్రజ్యోతి):ఏనుగుల దాడులను కట్టడి చేసేందుకు పలమనేరు మండలానికి చెందిన రజని అనే ఇంజనీరింగు విద్యార్థిని చొరవ చూపింది.గొబ్బిళ్లకోటూరుకు చెందిన రజని పూతలపట్టు మండలం పి.కొత్తకోట సమీపంలోని వేము ఇంజనీరింగ్ కళాశాలలో చదువుకుంటోంది.తేనెటీగలు, అగ్గితో పాటు పులి, సింహం వంటి వాటికి ఏనుగులు భయపడతాయి.దీనిని పరిగణనలోకి తీసుకొన్న రజని లేజర్ ట్రిపుల్ టెక్నిక్ ద్వారా ఏనుగులను దారిమళ్ళించేందుకు వీలుంటుందని చెబుతోంది.తక్కువ ఖర్చుతో లభ్యమయ్యే కెమెరా లాంటి ఈ పరికరాన్ని రైతులు పొలాల్లో ఏర్పాటు చేసుకుంటే గజ దాడులను నివారించవచ్చంటోంది .తాను రూపొందించబోయే పరికరంతో తేనెటీగలు, క్రూరమృగాలు తిరుగుతున్న శబ్దాలతో కూడిన దృశ్యాలు ఏనుగులకు కన్పిస్తాయంటోంది. ఈ పరికరాన్ని రైతు తన సెల్‌ఫోన్‌కు అనుసంధానం చేసుకుంటే అందులోని ప్రత్యేక సెన్సార్ ద్వారా ఏనుగులు పంటపొలాల్లోకి ప్రవేశించగానే అలర్టు మెసేజ్ వస్తుందని, దాంతో పంట, ప్రాణ నష్టాలను నివారించవచ్చని రజని చెబుతోంది. గురువారం పలమనేరులో ఎమ్మెల్యే అమరనాథరెడ్డిని కలిసి తాను తయారుచేయాలనుకుంటున్న పరికరాన్ని గురించి వివరించింది. ఎమ్మెల్యే కూడా స్పందించి ఈ విషయాన్ని పరిశీలించాలని ఆర్డీవో, అటవీశాఖ అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. కురబ కార్పొరేషన్ డైరెక్టర్ సుబ్రమణ్యం గౌడు, పలమనేరు ఏఎంసీ మాజీ ఛైర్మన్ రామచంద్ర నాయుడు పాల్గొన్నారు

పలమనేరు
కుప్పం/పుంగనూరు

రోడ్డు ప్రమాదంలో 15 మందికి గాయాలు



బోల్తాపడ్డ టెంపో ట్రావెల్స్

గంగవరం, డిసెంబరు5,(ఆంధ్రజ్యోతి): పలమనేరు- బెంగళూరు హైవేలో దండపల్లె రోడ్డు జంక్షన్ వద్ద రెండు వాహనాలు ఢీకొన్న ప్రమాదంలో 15 మంది గాయపడ్డారు. పోలీసుల కథనంమేరకు.. కర్ణాటక రాష్ట్రం చౌడ సంద్ర ప్రాంతానికి చెందిన 15 మంది కుటుంబ సభ్యులు బుధవారం తిరుచానూరు అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం అక్కడి నుండి టెంపో ట్రావెల్స్‌ను బాడుగకు మాట్లాడుకుని తిరుగు ప్రయాణమయ్యారు. దండపల్లె రోడ్డు జంక్షన్‌లో స్పీడ్ బ్రేకర్ వద్ద టెంపో ట్రావెల్ డ్రైవర్ బ్రేక్ వేయగా వెనుక నుంచి అతి వేగంగా వస్తున్న ఈచర్ వాహనం వెనుక నుండి ఢీకొంది. టెంపో ట్రావెల్ బోల్తాపడడంతో జయంతి, పూజ , అనిత, జలశ్రీ, గఘనలకు తీవ్రగాయాలయ్యాయి. మరో పదిమందికి స్వల్పగాయాలయ్యాయి. వీరిని పలమనేరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు అర్బన్ సీఐ ప్రసాద్ తెలిపారు.

డైట్‌లో అలరించిన కళా ఉత్సవ్



వెదురుకుప్పం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం డైట్‌లో గురువారం కళా ఉత్సవ్ పోటీలు అలరించారు. వివిధ పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు, ప్రశంసాపత్రాలను ప్రదానం చేశారు. లోకల్ మ్యూజిక్‌లో మొదటి బహుమతిని కార్వేటినగరం బాలికల హైస్కూల్ విద్యార్థి వి.తన్మయి, రెండో బహుమతిని పుత్తూరు బాలిక హైస్కూల్, మూడో బహుమతిని కార్వేటినగరం చెందిన పూజిత బృందం దక్కించుకున్నారు. అధ్యాపకులు నిర్మల, అనిత, దేవప్రసాద్ బృందం పాల్గొన్నారు.

సారా ఊట ధ్వంసం

పుంగనూరు రూరల్, డిసెంబరు5(ఆంధ్రజ్యోతి): పెద్దతాండా సమీప పొలాల్లో సారా తయారీకి నిల్వ ఉంచిన 400 లీటర్ల బెల్లం ఊటను గురువారం ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్‌శాఖ సీఐ సురేంద్రరెడ్డి తెలిపారు. నిల్వ చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఇండో-ఇజ్రాయిల్ భాగస్వామ్యంతో రైతులకు ఆధునిక సాంకేతికత



అటాచి ఉరీ రూబిస్ స్టీన్‌ను జ్ఞాపికతో సత్కరిస్తున్న అధికారులు

కుప్పం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఇండోఇజ్రాయిల్ భాగస్వామ్యంతో నడుస్తున్న సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీవోఈ) ద్వారా ఏపీ రైతులకు అత్యాధునిక సాంకేతిక వ్యవసాయ విధానాన్ని అందిస్తున్నామని ఇజ్రాయిల్ ఎంబసీ(అగ్రికల్చర్) అటాచీ ఉరీ రూబిస్ స్టీన్ చెప్పారు. కుప్పంలోని సీవోయిలో ఉద్యాన, వ్యవసాయ విధానంలో అత్యాధునిక సాంకేతిక పద్ధతుల అమలుపై మూడు రోజులు జరిగిన జాతీయ సదస్సు గురువారం ముగిసింది. ఇందులో పాల్గొన్న రూబిస్ స్టీన్ మాట్లాడుతూ ఇక్కడి కేంద్ర పభుత్వం, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, ఎంఐడీహెచ్‌లు సంయుక్తంగా సదస్సు నిర్వహించాయన్నారు. అత్యాధునిక సాంకేతిక పద్ధతులతో అంటుకట్టడం ద్వారా వచ్చే నూతన వంగడాలు ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లోనూ అధిక దిగుబడిని, లాభాలను ఇస్తాయన్నారు. తెగుళ్ల, చీడపీడలు ఆశించవన్నారు. తద్వారా నాణ్యమైన దిగుబడి సాధ్యమవుతుందన్నారు. జిల్లా ఉద్యాన శాఖాధికారి మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు రైతులకు ఆధునిక సాంకేతిక పద్ధతుల్లో లాభాలను ఆర్జించి పెట్టాలన్న లక్ష్యంతో కుప్పం సీవోయీ ఏర్పాటు చేశారన్నారు. 12 రాష్ట్రాలనుంచి వచ్చిన 40 మంది ఉద్యాన శాఖ అధికారుల బృందం సదస్సులో శిక్షణ పొందింది. ఉద్యాన శాఖ ఏడీ కోటేశ్వరరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు. కార్యక్రమంలో జిల్లాలోని ఉద్యాన శాఖాధికారులు పాల్గొన్నారు.

నకిలీ జనన ధ్రువీకరణ పత్రాల తయారీ: రెండు నెట్‌సెంటర్ల సీజ్



నెట్‌సెంటర్ విచారిస్తున్న అధికారులు

రామకుప్పం, డిసెంబరు 5: నకిలీ జనన ధ్రువీకరణ పత్రాలు తయారు చేస్తున్నారన్న ఫిర్యాదులతో గురువారం అధికారులు మండలంలోని నెట్‌సెంటర్లలో తనిఖీలు చేశారు. రెండు నెట్‌సెంటర్లను సీజ్ చేశారు. నకిలీ జనన ధ్రువీకరణ పత్రాలపై కొందరు కుప్పం ఆర్డీఓ శ్రీనివాసులురాజు ఫిర్యాదు చేశారు. దీంతో గురువారం ఆయన కుప్పం గ్రామీణ సీఐ మల్లేష్‌యాదవ్, రాళబూదుగూరు ఎస్ఐ నరేష్, రామకుప్పం తహశీల్దారు బాబు, ఎంపీడీఓ లక్ష్మీకాంత్‌లతో కలిసి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. మండల సచివాలయం రోడ్‌లో నవీన్ అనే యువకుడు, వీర్నమలలో బాలాజీనాయక్ అనే యువకుడు నెట్‌సెంటర్లను నిర్వహిస్తూ నకిలీ జనన ధ్రువీకరణ పత్రాలను అందించినట్టు గుర్తించారు. ప్రాథమికంగా తమకు ఆధారాలు లభించాయని తహశీల్దారు తెలిపారు. పూర్తి విచారణ చేయనున్నట్టు పేర్కొన్నారు.





రథమెక్కి... భక్తులను కటాక్షించి..!

● వైభవంగా అమ్మవారి రథోత్సవం









తిరుచానూరు పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాల్లో ఎనిమిదో రోజైన గురువారం ఉదయం రథోత్సవం వైభవంగా జరిగింది. ముత్యపు కవచపు అలంకారంలో అమ్మవారు సర్వస్వతంత్ర వీరలక్ష్మిగా రథంపై కొలువుదీరారు. ఉదయం 8 గంటలకు ధనుర్లగ్నంలో ప్రారంభమైన రథోత్సవం 10.15 గంటల వరకు మాడవీధుల్లో సాగింది. భక్తులు గోవిందా... గోవిందా అంటూ రథాన్ని లాగారు. రథంపై మిరియాలు, ఉప్పు చల్లి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. మధ్యాహ్నం 12 గంటలకు రథం మండపంలో అమ్మవారికి స్నపన తిరుమంజనం, సాయంత్రం ఆస్థాన మండపంలో ఊంజల్‌సేవ జరిగాయి. రాత్రి ఏడు గంటలకు అశ్వవాహనంపై కల్కిరూపంలో అమ్మవారు భక్తులను కటాక్షించారు. ఆయా కార్యక్రమాల్లో టీటీడీ ఈవో శ్యామలరావు, జేఈవో వీరబ్రహ్మం, ఆలయ డిప్యూటీ ఈవో గోవిందరాజన్, ఏఈవో దేవరాజులు, ఏవీఎస్వో సతీష్‌కుమార్, అర్చకులు శ్రీనివాసాచార్యులు, బాబుస్వామి, మణికంఠస్వామి, సూపరింటెండెంట్లు రమేష్, శ్రీవాణి, సుందరరత్నం, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, సుబ్బరాయుడు, సుభాస్కర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు. ఇక, గురువారం రాత్రితో వాహనసేవలు ముగిశాయి. ఈ ఎనిమిది రోజులు.. 16 వాహనాలపై అమ్మవారు వివిధ రూపాల్లో ఊరేగారు.

- తిరుచానూరు, ఆంధ్రజ్యోతి

బ్రహ్మోత్సవాల్లో నేడు

- ఉదయం 7 గంటలకు పల్లకీ ఉత్సవం
- 10 గంటలకు పంచమి తీర్థం మండపంలో చక్రత్తాళ్వారు, ఉత్సవమూర్తికి స్నపన తిరుమంజనం
- మధ్యాహ్నం 12.15 గంటలకు పద్మసరోవరంలో చక్రస్నానం
- రాత్రి 7.30 గంటలకు బంగారు తిరుచ్చి ఉత్సవం
- 9.30 గంటలకు ధ్వజావరోహణంతో బ్రహ్మోత్సవాలు పరిసమాప్తం



నేడే పంచమి తీర్థం

● మధ్యాహ్నం 12.15 గంటలకు చక్రస్నానం
● తిరుచానూరుకు చేరుకున్న భక్తజనం



పుష్కరిణిలోకి వెళ్లే క్యూలైన్లలో నిద్రిస్తున్న భక్తులు

తిరుచానూరు, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాల్లో చివరి రోజైన శుక్రవారం పంచమితీర్థం జరగనుంది. మధ్యాహ్నం 12.15 గంటలకు అభిజిత్ లగ్నంలో చక్రత్తాళ్వార్‌కు చక్రస్నానం నిర్వహించనున్నారు. ఆ తర్వాత భక్తులు పుష్కరిణిలో స్నానాలు ఆచరించనున్నారు. దీని కోసం గురువారం రాత్రికే తమిళనాడు, వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తిరుచానూరుకు చేరుకున్నారు. వీరందరినీ జడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన హోల్డింగ్ పాయింట్‌కు తరలించారు. రాత్రి పదిన్నర గంటలకే ఈ హోల్డింగ్ పాయింట్ నిండిపోయింది. కొందరు క్యూలైన్లలో పడుకున్నారు. ఇలా ఏర్పాటు చేసిన మూడు హోల్డింగ్ పాయింట్లనుంచి భక్తులను శుక్రవారం ఉదయం 9 గంటలపైన పుష్కరిణిలోకి అనుమతించనున్నారు. పుష్కరిణి నుంచి వెలుపలికి వచ్చిన భక్తులు అమ్మవారి దర్శనానికి వెళ్లడానికి ప్రత్యేక క్యూలైన్‌లు ఏర్పాటు చేశారు. ఒక గేటు వద్ద డీఎస్పీ స్థాయి అధికారి ఇన్‌చార్జిగా ఉంటూ తొక్కిసలాట లేకుండా చూసే బాధ్యతను పోలీసు యంత్రాంగం తీసుకుంది. చక్రస్నానం జరిగే ప్రాంతంలో భక్తులు దూసుకురాకుండా ఉండేందుకు గ్రిల్స్ ఏర్పాటు చేశారు. వీవీఐపీలకు, వీఐపీలకు, టీటీడీ ఉద్యోగులకు, మీడియాకు ప్రత్యేక గ్యాలరీలు ఏర్పాటు చేశారు. పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.



చక్రస్నానం కోసం గురువారం రాత్రే తిరుచానూరుకు చేరుకుని హోల్డింగ్ పాయింట్‌లో సేదతీరుతున్న భక్తులు

విలువైన ఆభరణాలు ధరించి రావద్దని భక్తులకు సూచించారు. ఉదయం అమ్మవారికి సారె ఊరేగింపు సందర్భంగా గజరాజులు బెదరకుండా సింధు జంక్షన్ నుంచి ఆలయ ముఖద్వారం వరకు రోడ్డు డివైడర్‌కు ఇనుప కంచె ఏర్పాటు చేశారు. భక్తులను ఒకే మార్గంలోనే అనుమతించనున్నారు. మరోవైపు గురువారం రాత్రి నుంచి శుక్రవారం సాయంత్రం 4గంటల వరకు తిరుచానూరులోకి వాహనాలను నిషేధించారు.

హోల్డింగ్ పాయింట్లకు ఇలా..

పుత్తూరు వైపు నుంచి వచ్చే వారికి తిరుచానూరు గోశాల వద్ద, జడ్పీ ఉన్నత పాఠశాల.. తిరుపతి, చంద్రగిరి, రేణిగుంట వైపు నుంచి వచ్చే భక్తులు నవజీవన్ ఆస్పత్రి వద్ద హోల్డింగ్ పాయింట్లకు చేరుకోవాలి.

అమ్మవారి జన్మదినమే..

కార్తీకమాస శుక్లపక్ష పంచమి ఉత్తరాషాఢ నక్షత్రయుక్త అభిజిత్ లగ్నం శుక్రవారం రోజున పద్మావతిగా స్వర్ణకమలం మధ్యలో అమ్మవారు ఆవిర్భవించారని పురాణోక్తి. ఆ జన్మదినాన్ని పంచమి తీర్థంగా వ్యవహరిస్తారు. బ్రహ్మోత్సవాల్లో పంచమితీర్థం నిర్వహిస్తారు. ఈ ఉత్సవానికి వివిధ రాష్ట్రాల నుంచి భక్తులు తరలివచ్చి పద్మసరోవరంలో స్నానాలు ఆచరిస్తారు.

120 సీసీ కెమెరాలు, డ్రోన్లతో నిఘా

తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): తిరుచానూరులో శుక్రవారం జరిగే పంచమి తీర్థానికి 120 సీసీ కెమెరాలు, ఆరు డ్రోన్లతో పోలీసులు నిఘా ఉంచారు. పుష్కరిణిలోని ప్రతి గేటు వద్ద సీసీ కెమెరా అమర్చారు. ఆకతాయిలు అల్లరి చేష్టలకు పాల్పడితే వెంటనే అదుపులోకి తీసుకుంటారు. చైన్‌స్నాచింగ్‌లు, జేబు దొంగతనాలకు తావు లేకుండా చూస్తున్నారు. 22 గేట్ల ద్వారా పుష్కరిణిలోకి... వెలుపలకు భక్తులను అనుమతిస్తారు. ఒకేసారి 1500 మంది పుష్కరిణిలో స్నానం ఆచరించేలా చర్యలు తీసుకున్నారు. వైద్య శిబిరాలతో పాటు 108, టీటీడీ అంబులెన్సులను అందుబాటులో ఉంచారు. పోలీసుశాఖ ఆధ్వర్యంలో దాదాపు 1400 మంది, టీటీడీ సెక్యూరిటీ మరో 600 మందితో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. టీటీడీ సీవీఎస్వో శ్రీధర్, జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు అమ్మవారి ఆలయం చుట్టూ తనిఖీ చేశారు. బందోబస్తు పర్యవేక్షించారు.

పార్కింగ్ ప్రదేశాలు ఇవే

మ్యాంగో గార్డెన్, అర్బన్ హట్, పూడి క్రాస్, నారాయణాద్రి క్రాస్ రోడ్డు వద్ద పార్కింగ్ ప్రదేశాలు ఏర్పాటు చేసి, సూచిక బోర్డులు పెట్టారు. పోలీసులను నియమించారు. ఆయా ప్రాంతాల్లో వచ్చే వాహనాలను ఈ పార్కింగ్ ప్రదేశాల్లో ఉంచి భక్తులు నడుచుకుంటూ హోల్డింగ్ పాయింట్లకు చేరుకోవాలి.



అశ్వవాహనంపై అఖిలాండనాయకి

గురువారం రాత్రి ఏడు గంటలకు అశ్వవాహనంపై మహారాణి అలంకారంలో అమ్మవారు భక్తులను కటాక్షించారు. గజతురగ, వృషభాలు ముందు నడవగా, మంగళవాయిద్యాలు, భజన బృందాలు, భక్తుల కోలాటాలు, జీయ్యర్ స్వాముల పరివారం ప్రబంధ పారాయణం నడుమ అశ్వవాహనంపై అమ్మవారు మాడవీధుల్లో ఊరేగారు. హరి పట్టపు రాణి అలమేలు మంగమ్మను అశ్వవాహనంపై దర్శించుకుంటే కలిదోషాలు తొలగుతాయనేది భక్తుల నమ్మకం. దీంతో ఎక్కువ సంఖ్యలో భక్తులు హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు.

- తిరుచానూరు, ఆంధ్రజ్యోతి



గంజాయి కేసులో నిందితులను అరెస్టు తీసుకొస్తున్న పోలీసులు

పోలీసులకు చిక్కిన గంజాయి బ్యాచ్

17 మంది అంతరాష్ట్ర ముఠా అరెస్టు ● 32 కిలోలు స్వాధీనం

తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): తమిళనాడు, కర్నాటక, కేరళ రాష్ట్రాలకు గంజాయి సరఫరా చేస్తున్న ముఠాను శ్రీకాళహస్తి పోలీసులు పట్టుకున్నారు. వారి నుంచి 32 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. నాలుగు సెల్‌ఫోన్లు సీజ్ చేశారు. ఈ వివరాలను గురువారం తిరుపతిలో ఎస్పీ సుబ్బరాయుడు మీడియాకు వెల్లడించారు. ఆయన తెలిపిన ప్రకారం.. వెంకటగిరికి చెందిన సాయిసందీప్, వెల్లంపాలెంకు చెందిన పి.జశ్వంత్, శ్రీకాళహస్తికి చెందిన గాది గణేష్, షేక్ నసీమ్, ఎలిరి హేమంత్, కోటం బెటి రాజా, పెనమల రాజు, బత్తిని కుమార్ రాజా, ఆవల ఆకాష్, కారణి సాయికుమార్, కుప్పం శశి, శివ, చెరుకుట్టి వంశీ, ముత్తరాశిపాలెంకు చెందిన ఇసకమట్ల మనోజ్‌కుమార్, జెట్టిపాళేనికి చెందిన కుంచాల నాగరాజు, పాడేరు జిల్లా అరకువాసి సొంగుల అనంత రాము, తుమ్మలగుంటలో ఉంటున్న తేజ ముఠాగా ఏర్పడ్డారు. సులభంగా డబ్బు సంపాదించాలని గంజాయి రవాణాకు ప్రయత్నించారు. వీరికి అరకుకు చెందిన అనంతరాముతో పరిచయాలు ఏర్పడ్డాయి. కొన్నేళ్లుగా అరకు, పాడేరు నుంచి రైళ్లు, ట్రాన్స్‌పోర్టు వాహనాల ద్వారా జిల్లాకు గంజాయి తెచ్చేవారు. శ్రీకాళహస్తి కేంద్రంగా తమిళనాడు, కేరళ, కర్ణాటక ప్రాంతాలకు తరలించి.. అక్కడ పొడి చేసి చిన్న, చిన్న ప్యాకెట్లుగా విక్రయిస్తున్నారు. కొన్నేళ్లుగా వీరి కదలికలపై శ్రీకాళహస్తి పోలీసులు నిఘా పెట్టారు. శ్రీకాళహస్తి, తిరుపతి అడ్డాగా పలు రాష్ట్రాలకు గంజాయి అక్రమంగా తరలిస్తున్న 17 మందిని గుర్తించారు. వీరిని పట్టుకునేందుకు జిల్లా అదనపు ఎస్పీ రవిమనోహరాచ్చారి నేతృత్వంలో శ్రీకాళహస్తి డీఎస్పీ నరసింహమూర్తి, సీఐలు గోపి, వెంకటేష్, ఎం.రవినాయక్, తిమ్మయ్య, ఎస్‌ఐ సుధాకరరెడ్డి, సిబ్బంది కలసి వలపన్నారు. శ్రీకాళహస్తిలోని బృందమ్మ కాలనీ, పనసకోనమండపం, తొట్టంబేడు పరిధిలోని స్వర్ణముఖి బ్రిడ్జి కింద బ్యాచ్‌లుగా ఉన్న 17 మందిని పట్టుకున్నారు. వీరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్పీ చెప్పారు. ఈ కేసులో ప్రతిభ చూపిన పోలీసు అధికారులు, సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

తిరుపతి నుంచి సింగపూర్‌కు..

నేడు అంతర్జాతీయ విమాన సర్వీసు ట్రయల్ రన్

రేణిగుంట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): తిరుపతి విమానాశ్రయం నుంచి అంతర్జాతీయ విమాన సర్వీసులను ప్రారంభించడానికి సన్నాహాలు చేపట్టారు. శుక్రవారం ఉదయం 5గంటలకు తిరుపతి నుంచి సింగపూర్‌కు మొదటి అంతర్జాతీయ విమాన సర్వీసు ట్రయల్ రన్ నిర్వహిస్తున్నట్లు విమానాశ్రయ డైరెక్టర్ శ్రీనివాసరావు చెప్పారు. లక్స్ ఏవియేషన్ సాన్ మారినో జీఎల్ఈఎక్స్ విమానం ఒక ప్రయాణికుడు, నలుగురు సిబ్బందితో ఉదయం బయలు దేరుతుందన్నారు.

శ్రీకాళహస్తీశ్వరాలయంలో పోటు ఇన్‌చార్జి సస్పెన్షన్

శ్రీకాళహస్తి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలోని ప్రసాదం తయారీ పోటులో గోల్‌మాల్ జరిగినట్లు ఈవో బాపిరెడ్డి గుర్తించారు. ఇన్‌ఛార్జిగా పనిచేసే జూనియర్ అసిస్టెంట్ సురేష్‌రెడ్డిని సస్పెండు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. పోటులో జిలేబీ, లడ్డూ, వడతో పాటు పులిహోర ప్రసాదాలను తయారు చేసి కౌంటర్లకు తరలిస్తుంటారు. పులిహోర అన్నంతో తయారు చేసే పదార్థం కావడంతో బియ్యం ఉడికిన తరువాత కొంత బరువు పెరుగుతుంది. స్టోర్ నుంచి కొలత ప్రకారం స్వీకరించిన పదార్థాల ప్రకారం అదే లెక్కతో ప్రసాదాల కౌంటర్‌కు తరలించాలి. గురువారం ఈవో బాపిరెడ్డి పోటును తనిఖీ చేశారు. అక్కడ నిల్వ ఉన్న సరుకు, రిజిస్టర్‌లో నమోదుకు తేడాలను గుర్తించారు. పోటు నుంచి కౌంటర్‌కు తరలించిన పులిహోర మోతాదులో పెద్ద ఎత్తున వ్యత్యాసం ఉన్నట్లు ఆయన ఆధారాలతో పట్టుకున్నారు. పోటు ఇన్‌చార్జిగా పనిచేస్తున్న జూనియర్ అసిస్టెంట్ సురేష్‌రెడ్డిపై సస్పెన్షన్ వేటు వేశారు. కాగా, ప్రసాదాల తయారీనుంచి కౌంటర్లలో విక్రయాల వరకు చాలామంది కుమ్మక్కు అయితేనే ఈ అక్రమం జరిగే అవకాశం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. దీని వెనుక అసలు పాత్రధారులు, సూత్రధారులు ఎవరన్నది లోతుగా దర్యాప్తు చేసి నిగ్గు తేల్చాల్సి ఉంది.

సచివాలయంలో జడ్పీ సీఈవో తనిఖీలు


సిబ్బందితో మాట్లాడుతున్న రవికుమార్ నాయుడు

తవణంపల్లె, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): దిగువమాఘం సచివాలయాన్ని, తవణంపల్లె ఎంపీడీవో కార్యాలయాన్ని జడ్పీ సీఈవో రవికుమార్ నాయుడు గురువారం తనిఖీ చేశారు. రికార్డులు, సిబ్బంది హాజరును పరిశీలించారు. హౌస్ హోల్డ్ మ్యాపింగ్, స్వర్ణ పంచాయతీ తదితర సర్వేలపై వివరాలు అడిగి తెలుసుకొన్నారు. డీఎల్‌డీవో రవికుమార్, ఎంపీడీవో రెడ్డిబాబు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

భూమి ఆక్రమణకు యత్నం: మహిళ ఆరోపణ


సుభాషిణి

చిత్తూరు సిటీ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): తమ భూమిని కొందరు దౌర్జన్యంగా ఆక్రమించడానికి యత్నిస్తున్నారని యాదమరి మండలం దళవాయిపల్లెకి చెందిన సుభాషిణి ఆరోపించారు. గురువారం చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతూ.. తమ 2.42 ఎకరాల భూమిని గ్రామానికి చెందిన భాస్కర్, వారి కుటుంబసభ్యులు ఆక్రమించుకునేందుకు ఎక్స్‌కవేటర్లు పెట్టి చదును చేస్తున్నారని చెప్పారు. తహసీల్దారుకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. పైగా భాస్కర్ తమపై తప్పుడు కేసులు పెట్టించి, ఇబ్బందులకు చేస్తున్నారని వాపోయారు. కలెక్టర్ దీనిపై విచారించి, న్యాయం చేయాలని కోరారు.

జోరుగా టీడీపీ సభ్యత్వ నమోదు



తవణంపల్లె, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మేజరు పంచాయతీ అరగొండ పరిధిలోని పైమాఘంలో బుధ, గురువారాల్లో 300 టీడీపీ సభ్యత్వాలను నాయకులు నమోదు చేశారు. నాయకులు రఘుపతి, నిషాంత్, రంజిత్, కిరణ్ చౌదరి, మహేష్, వంశీప్రకాష్, చాన్ బాషా, తులసి, గాంధీ పాల్గొన్నారు.

భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు వాడాలి


రైతులతో నాగపద్మిని

వెదురుకుప్పం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రైతులందరూ భూసార పరీక్షల ఆధారంగా ఎరువులను వాడాలని డీఆర్సీ జిల్లా అధికారి టీవీ నాగపద్మిని తెలిపారు. గురువారం ఆళ్లమడుగు, కొమరగుంట, తిరుమలయ్యపల్లె గ్రామ సచివాలయ వద్ద ప్రపంచ నేల దినోత్సవ కార్యక్రమాన్ని రైతులతో కలసి జరుపుకున్నారు. ఖరీఫ్-2024లో తీసిన మట్టి నమూనా ఫలితాలను రైతులకు అందించారు. ఏవో వనిత, లక్ష్మీప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

డీపీవోకి సన్మానం



వెదురుకుప్పం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): వెదురుకుప్పం ఎంపీడీవోగా విధులు నిర్వహిస్తూ అన్నమయ్య జిల్లాకు బదిలీపై వెళ్లి పదోన్నతిపై జిల్లా పంచాయతీ అధికారిగా(డీపీవో) సుధాకర్‌రావు వచ్చిన విషయం తెలిసిందే. ఈనేపథ్యంలో గురువారం ఆయన్ను వెదురుకుప్పం ఈవోపీఆర్డీ పురుషోత్తం, డీడీవోలు సన్మానించారు.

ఎమ్మెల్యే ఆదేశాలతో గుంతల పూడ్చివేత



గంగాధరనెల్లూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే థామస్ ఆదేశాలతో నీవానది బ్రిడ్జి దాటాక వేల్కూరు రోడ్డువైపు ఏర్పడిన గుంతలను గురువారం స్థానిక టీడీపీ నేతలు పూడ్పించారు. ఈ పనులను పార్లమెంట్ టీడీపీ ఉపాధ్యక్షుడు వెంకటేష్, నేతలు హరీష్‌యాదవ్, నరసింహులు నాయుడు పర్యవేక్షించారు. ఇన్‌చార్జి సీఐ శ్రీనివాసంతి కూడా వీరితోపాటు ఉన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోండి


పాలేరు వద్ద డంపింగ్ యార్డును పరిశీలిస్తున్న సుధాకర్‌రావు

బంగారుపాళ్యం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని డీపీవో సుధాకర్‌రావు సూచించారు. గురువారం బంగారుపాళ్యం, పాలేరు పంచాయతీల్లోని డంపింగ్ యార్డులను పరిశీలించారు. సర్పంచ్ ఉమాదేవి కృష్ణమూర్తి, ఈవోపీఆర్డీ గణపతి, పంచాయతీ కార్యదర్శులు యుగంధర్, భాస్కర్ పాల్గొన్నారు.

ఇండో-ఇజ్రాయిల్ భాగస్వామ్యంతో
రైతులకు ఆధునిక సాంకేతికత
ఇజ్రాయిల్ ఎంబసీ అగ్రికల్చర్ అటాచీ ఉరీ రూబిస్ స్టీన్



అటాచి ఉరీ రూబిస్ స్టీన్‌ను జ్ఞాపికతో సత్కరిస్తున్న ఉద్యాన శాఖాధికారులు

కుప్పం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఇండోఇజ్రాయిల్ భాగస్వామ్యంతో నడుస్తున్న సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ (సీవోఈ) ద్వారా ఏపీ రైతులకు అత్యాధునిక సాంకేతిక వ్యవసాయ విధానాన్ని అందిస్తున్నామని ఇజ్రాయిల్ ఎంబసీ(అగ్రికల్చర్) అటాచీ ఉరీ రూబిస్ స్టీన్ చెప్పారు. కుప్పంలోని సీవోయిలో ఉద్యాన, వ్యవసాయ విధానంలో అత్యాధునిక సాంకేతిక పద్ధతుల అమలుపై మూడు రోజులు జరిగిన జాతీయ సదస్సు గురువారం ముగిసింది. ఇందులో పాల్గొన్న రూబిస్ స్టీన్ మాట్లాడుతూ ఇక్కడి కేంద్ర పభుత్వం, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, ఎంఐడీహెచ్‌లు సంయుక్తంగా సదస్సు నిర్వహించాయన్నారు. అత్యాధునిక సాంకేతిక పద్ధతులతో అంటుకట్టడం ద్వారా వచ్చే నూతన వంగడాలు ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లోనూ అధిక దిగుబడిని, లాభాలను ఇస్తాయన్నారు. తెగుళ్ల, చీడపీడలు ఆశించవన్నారు. , తద్వారా నాణ్యమైన దిగుబడి సాధ్యమవుతుందన్నారు. జిల్లా ఉద్యాన శాఖాధికారి మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు రైతులకు ఆధునిక సాంకేతిక పద్ధతుల్లో లాభాలను ఆర్జించి పెట్టాలన్న లక్ష్యంతో కుప్పం సీవోయి ఏర్పాటు చేశారన్నారు. 12 రాష్ట్రాలనుంచి వచ్చిన 40 మంది ఉద్యాన శాఖ అధికారుల బృందం సదస్సులో శిక్షణ పొందింది. ఉద్యాన శాఖ ఏడీ కోటేశ్వరరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు. కార్యక్రమంలో జిల్లాలోని ఉద్యాన శాఖాధికారులు పాల్గొన్నారు.

డైట్‌లో అలరించిన కళా ఉత్సవ్


ప్రశంసాపత్రాలు అందుకున్న విద్యార్థులతో అధ్యాపకులు

వెదురుకుప్పం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం డైట్‌లో గురువారం కళా ఉత్సవ్ పోటీలు అలరించారు. వివిధ పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు, ప్రశంసాపత్రాలను ప్రదానం చేశారు. లోకల్ మ్యూజిక్‌లో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను వరుసగా.. వి.తన్మయి బృందం (కార్వేటినగరం బాలికల హైస్కూల్), పుత్తూరు బాలికల హైస్కూల్, పూజిత బృందం (కార్వేటినగరం) దక్కించుకున్నారు. అధ్యాపకులు నిర్మల, అనిత, దేవప్రసాద్ పాల్గొన్నారు.


విద్యార్థినుల నృత్య ప్రదర్శనలు

డ్వాక్రా మహిళల అభివృద్ధే ధ్యేయం: ఎమ్మెల్యే


మహిళలకు ప్రశంసాపత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే మురళీమోహన్

పూతలపట్టు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): డ్వాక్రా మహిళల అభివృద్ధే టీడీపీ ధ్యేయమని పూతలపట్టు ఎమ్మెల్యే మురళీ మోహన్ అన్నారు. గురువారం ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో మహిళా సంఘాల అభినందన సభకు ముఖ్యఅతిథిగా విచ్చేశారు. రాష్ట్ర మహిళా అభివృద్ధి సంస్థ నిర్వహించిన ఓ కార్యక్రమంలో తవణంపల్లె, పూతలపట్టు మండలాలకు చెందిన మహిళా సంఘాలు జాతీయస్థాయిలో అవార్డులు అందుకోవడం అభినందనీయమన్నారు. డీఆర్డీఏ పీడీ శ్రీదేవి, ఏపీడీ రవి, ఎంపీడీవో నాగరాజు, జడ్పీటీసీ దేవిక, నాగరత్నమ్మ, సభ్యులు పాల్గొన్నారు.

పన్ను వసూలుకు ప్రత్యేక డ్రైవ్: కమిషనర్


నోటీసులు ఇస్తున్న మున్సిపల్ అధికారులు

నగరి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): నగరి మున్సిపల్ పరిధిలో పేరుకున్న పన్ను బకాయిల వసూలుకు ప్రత్యేక డ్రైవ్ అధికారులు ప్రారంభించారు. కమిషనర్ కృష్ణారెడ్డి గురువారం సిబ్బందితోపాటు వెళ్లి పన్ను బకాయిదారులతో మాట్లాడారు. వారికి నోటీసులను అందజేశారు.

బీసీలకు చట్ట సభల్లో 50 శాతం రిజర్వేషన్ కల్పించాలి


ధర్నాలో పాల్గొన్న జ్ఞాన జగదీశ్

చిత్తూరు అర్బన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): చట్ట సభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించాలన్న డిమాండుతో గురువారం ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద మహాధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో మాజీ మంత్రి హనుమంతరావు, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకరరావు, జిల్లా అధ్యక్షుడు జ్ఞాన జగదీశ్ తదితరులు పాల్గొన్నారు.

కాలువలో ఆక్రమణల తొలగింపు


ఎక్స్‌కవేటర్‌తో ఆక్రమణలను తొలగిస్తున్న అధికారులు

యాదమరి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కాలువలో ఆక్రమణలను తొలగించారు. దళవాయిపల్లె గ్రామ సరిహద్దులో నీటి ప్రవాహపు కాలువను ఆక్రమించారని కొందరు రైతులు పీజీఆర్ఎస్‌లో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఆయన ఆదేశాలతో తహసీల్దార్ పార్థసారథి, ఎస్ఐ ఈశ్వర్, ఆర్ఐ ప్రసాద్, మండల సర్వేయర్ తులసీధర్ గురువారం సంఘటనా స్థలానికి చేరుకున్నారు. కాలువలోని ఆక్రమణలను ఎక్స్‌కవేటర్ సాయంతో తొలగించారు.

టీచర్ మృతికి కారకులను శిక్షించాలి: ఫ్యాప్టో


చిత్తూరులో కొవ్వొత్తులతో నివాళి అర్పిస్తున్న నాయకులు

చిత్తూరు సెంట్రల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా రాయచోటిలో ఉపాధ్యాయుడు ఇజాజ్ అహ్మద్ మృతికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని ఫ్యాప్టో సంఘ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం డీఈవో కార్యాలయం ముందు కొవ్వొత్తులతో నివాళి అర్పించారు. అనంతరం డీఈవో వరలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. ఎస్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు గంటా మోహన్ మాట్లాడుతూ.. విద్యార్థుల దాడిలో టీచర్ మృతి చెందడం దారుణమన్నారు. నాయకులు మదన్‌మోహన్, చెంగల్రాయమందడి, పరంజ్యోతి, మునీర్, గఫూర్, మధుబాబు, చంద్రన్, పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

నగరి: ఆర్డీవో కార్యాలయం వద్ద జరిగిన నిరసనలో ఫ్యాప్టో నాయకులు మునిరత్నం, సంతోష్‌కుమార్, లక్ష్మీనారాయణ, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

శెట్టిఫారం అండర్ బ్రిడ్జి నిర్మాణానికి మార్గం సుగమం


నితిన్ గడ్కరీకి వినతిపత్రం అందజేస్తున్న ఎంపీ ప్రసాదరావు

చిత్తూరు సిటీ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): గంగాధరనెల్లూరు నియోజకవర్గం చిన్నవేపంజేరి రెవెన్యూ శెట్టిఫారం గ్రామానికి సంబంధించిన అండర్‌బ్రిడ్జి నిర్మాణానికి మార్గం సుగమం అయ్యింది. శెట్టిఫారం గ్రామ ప్రజలు అండర్ ప్యాసేజి బ్రిడ్జి సౌకర్యంలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో తమ ఇబ్బందులను ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు దృష్టికి తీసుకెళ్లారు. మృతదేహాన్ని శ్మశానానికి తరలించాలన్నా సరైన దారిలేక ఇబ్బందులు పడుతున్నామని తెలియజేశారు. ఈ సమస్యలను వివరిస్తూ.. కేంద్ర ప్రభుత్వానికి ఎంపీ లేఖరాశారు. అలాగే కేంద్రమంత్రి నితిన్ గడ్కరీని ఢిల్లీలో స్వయంగా కలిసి వినతి పత్రం సమర్పించారు. స్పందించిన ఆయన బ్రిడ్జి నిర్మాణానికి అనుమతిస్తున్నట్లు లేఖ రాశారని ఎంపీ పేర్కొన్నారు.

తహసీల్దార్‌ను సస్పెండ్ చేయాలి: సీపీఐఎంఎల్


ఆందోళనకారులతో చర్చిస్తున్న తహసీల్దార్ రమేష్‌బాబు

వెదురుకుప్పం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలు పరిష్కరించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న వెదురుకుప్పం తహసీల్దార్ రమేష్‌బాబును సస్పెండ్ చేసి, అవినీతి, అక్రమాలపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని సీపీఐఎంఎల్ జిల్లా కార్యవర్గ సభ్యుడు కొత్తపల్లి సుబ్రహ్మణ్యం డిమాండ్ చేశారు. గురువారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఎస్సీ సామాజికవర్గ బాధితులతో కలసి రిలే దీక్షకు కూర్చొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. చెరువు తూమును అక్రమార్కులు ధ్వంసం చేసినా, తన పరిధిలోకి రాదని తహసీల్దార్ నిర్లక్ష్యపు సమాధానం ఇవ్వడం బాధ్యతారాహిత్యమన్నారు. దళితుల పట్ల వివక్ష చూపుతున్నారని ఆరోపించారు. చివరకు తహసీల్దార్ రమేష్‌బాబు వారితో చర్చించారు. బాధితుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు.

కిటికీ పగులగొట్టి గదిలో ధాన్యం తిన్న ఏనుగు


ఏనుగు తినగా మిగిలిన ధాన్యం

పలమనేరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): బండిండ్లు సమీపంలో బుధవారం రాత్రి విజయన్ అనే రైతుకు చెందిన ధాన్యాన్ని ఏనుగు తిని వెళ్లిపోయింది. ధాన్యాన్ని పొలం వద్ద గదిలో రైతు భద్రపరచి ఇంటికి వెళ్లాడు. గురువారం ఉదయం వచ్చి చేశాడు. ఏనుగు కిటికీ పగులగొట్టి గదిలో చొరబడి ధాన్యంలో కొంతమేర తినివెళ్లినట్లు గుర్తించాడు. అంతకుముందే ఇక్కడ ఓ ఏనుగు సంచరించడాన్ని కొందరు రైతులు గుర్తించారు. ఒంటరి ఏనుగు తమ పంటలను తొక్కి. నాశనం చేసిందని బాధిత రైతులు లబోదిబోమంటున్నారు. విజయన్ అటవీక్షేత్రస్థాయి సిబ్బందికి, అటవీ అధికారులకు ఫిర్యాదు చేశాడు.

ఏనుగుల కట్టడికి వినూత్న ఆలోచన
ఇంజనీరింగ్ విద్యార్థిని చొరవ


ఎమ్మెల్యే అమరనాథరెడ్డికి వివరిస్తున్న రజని

పలమనేరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఏనుగుల దాడులను కట్టడి చేసేందుకు పలమనేరు మండలానికి చెందిన రజని అనే ఇంజనీరింగు విద్యార్థిని చొరవ చూపింది. గొబ్బిళ్లకోటూరుకు చెందిన రజని పూతలపట్టు మండలం పి.కొత్తకోట సమీపంలోని వేముఇంజనీరింగ్ కళాశాలలో చదువుకుంటోంది. తేనెటీగలు, అగ్గితో పాటు పులి, సింహం వంటి వాటికి ఏనుగులు భయపడతాయి. దీనిని పరిగణనలోకి తీసుకొన్న రజని లేజర్ ట్రిపుల్ టెక్నిక్ ద్వారా ఏనుగులను దారిమళ్లించేందుకు వీలుంటుందని చెబుతోంది. తక్కువ ఖర్చుతో లభ్యమయ్యే కెమెరా లాంటి ఈ పరికరాన్ని రైతులు పొలాల్లో ఏర్పాటు చేసుకుంటే గజదాడులను నివారించవచ్చంటోంది. తాను రూపొందించబోయే పరికరంతో తేనెటీగలు, క్రూరమృగాలు తిరుగుతున్న శబ్దాలతో కూడిన దృశ్యాలు ఏనుగులకు కన్పిస్తాయంటోంది. ఈ పరికరాన్ని రైతు తన సెల్‌ఫోన్‌కు అనుసంధానం చేసుకుంటే అందులోని ప్రత్యేక సెన్సార్ ద్వారా ఏనుగులు పొలాల్లోకి ప్రవేశించగానే అలర్టు మెసేజ్ వస్తుందని, దాంతో పంట, ప్రాణ నష్టాలను నివారించవచ్చని చెబుతోంది. గురువారం పలమనేరులో ఎమ్మెల్యే అమరనాథరెడ్డిని కలిసి తాను తయారు చేయాలనుకుంటున్న పరికరాన్ని గురించి వివరించింది. దీన్ని పరిశీలించాలని ఆర్డీవో, అటవీ శాఖ అధికారుల దృష్టికి ఎమ్మెల్యే తీసుకెళ్లారు. కురబ కార్పొరేషన్ డైరెక్టర్ సుబ్రమణ్యం గౌడు, పలమనేరు ఏఎంసీ మాజీచైర్మన్ రామచంద్ర నాయుడు పాల్గొన్నారు.

లారీ ఢీకొని ఒకరి దుర్మరణం


ఆత్మయ్య (ఫైల్ ఫొటో)

ఐరాల, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): లారీ ఢీకొని ఓ వ్యక్తి దుర్మరణం చెందిన సంఘటన గురువారం ఐరాల పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. తెల్లగుండ్లపల్లె ఎస్సీ కాలనీకి చెందిన వెంకటస్వామి కుమారుడు ఆత్మయ్య(43), తన స్నేహితుడు సురేష్‌తో కలిసి పాకాల నుంచి బైక్‌పై స్వగ్రామానికి బయల్దేరాడు. అక్కంచెరువుపల్లె వద్దకొచ్చేసరికి వీరిని వెనుకనుంచి లారీ ఢీకొంది. కిందపడిన ఆత్మయ్య తలపై లారీ చక్రం ఎక్కింది. దీంతో తల నుజ్జునుజ్జయి అక్కడికక్కడే మృతి చెందాడు. సురేష్‌కు గాయాలయ్యాయి. అయినా లారీ ఆగకుండా వెళ్లిపోయింది. బాధితుడిని చికిత్స నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ద్విచక్ర వాహనాల దొంగ అరెస్టు



బంగారుపాళ్యం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనాల దొంగతనానికి పాల్పడిన ఓ వ్యక్తిని గురువారం అరెస్టుచేసినట్లు సీఐ కత్తిశ్రీనివాసులు తెలిపారు. ఈనెల 4వ తేదీన గుడియాత్తానికి చెందిన నాగరాజు రాగిమానుపెంట రోడ్డుపక్కన నిలిపి ఉంచిన ద్విచక్రవాహనాన్ని చోరీ చేశారు. దీనిపై అదేరోజున పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు.. నిందితుడైన మొగిలి వెంకటగిరికి చెందిన రాజేష్‌ను నలగాంపల్లె ఫ్లైఓవర్ వద్ద అదుపులోకి తీసుకున్నారు. అతడి వద్ద 1.40లక్షల విలువైన రెండు పల్సర్ వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదుచేసి నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. ఇతనిపై ఇదివరకే పలుకేసులు ఉన్నాయని సీఐ తెలిపారు.

కబడ్డీ పోటీల్లో విజేతలు నెల్లేపల్లె హైస్కూల్ విద్యార్థులు



గంగాధరనెల్లూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): జోనల్ కబడ్డీ పోటీల్లో సీనియర్ బాలుర విభాగంలో నెల్లేపల్లె హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు విజేతలుగా నిలిచారు. తూగుండ్రం హైస్కూల్లో జరిగిన పోటీల్లో గురువారం నియోజకవర్గానికి చెందిన పలు కబడ్డీ జట్లు తలపడ్డాయి. నెల్లేపల్లె హైస్కూల్ విద్యార్థులు విన్నర్స్‌గా, సిద్దేశ్వరకొండ (మేనాటంపల్లె) హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు రన్నర్స్‌గా నిలిచారు. ఈ కార్యక్రమంలో తూగుండ్రం, నెల్లేపల్లె హైస్కూల్ హెచ్‌ఎంలు రాజేంద్రనాయుడు, సుబ్బరత్నమ్మ, అసిస్టెంట్ హెచ్‌ఎం యుగంధరాచ్చారి, పీడీలు రజని, లక్ష్మయ్య పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

ప్రత్యేక ప్రతిభావంతులపై వివక్ష తగదు

వెదురుకుప్పం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ప్రత్యేక ప్రతిభావంతులపై వివక్ష తగదని కార్వేటినగరం ఎంఈవోలు మంచికాయల విజయకుమార్, మనోజ్‌కుమార్ తెలిపారు. గురువారం భవిత కేంద్రంలో ప్రత్యేక ప్రతిభావంతుల దినోత్సవం జరుపుకున్నారు. టీచర్లు సింధుజ, ధనంజయులు, రేఖ పాల్గొన్నారు.

ఐరాల: ఎంఆర్సీ భవనం వద్ద ఉన్న ఎంపీపీ ఎస్ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఎంపీడీవో ధనలక్ష్మి, ఎంఈవోలు రుష్యేంద్రబాబు, దామోదర్‌నాయుడు, హెచ్‌ఎం చాముండేశ్వరి, టీచర్లు సురేష్, కవిత, సీఆర్పీరవి పాల్గొన్నారు.

నిండ్ర: మండల విద్యావనరుల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంఈవోలు వసుమతిదేవి, శ్రీధర్‌రాజు, ఎంపీపీ జలంధర్ దీప, సీఆర్పీలు పాల్గొన్నారు.

గుడిపాల: నరహరిపేట జడ్పీహైస్కూల్‌లోని భవితకేంద్రంలో జరిగిన కార్యక్రమంలో ఎంఈవో-2 గణపతి, ఐఆర్పీ ఉపాధ్యాయులు వాణి, భవిత, దాతలు దిలీప్, ప్రేమ్, వినాయగం, ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.

గంగాధరనెల్లూరు: ప్రాథమిక పాఠశాలలోని భవితకేంద్రంలో ఎంఈవో ఆంజినేయులుశెట్టి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జిల్లా సహితవిద్య సమన్వయకర్త జయప్రకాష్‌నాయుడు, హెచ్‌ఎంలు రెడ్డెమ్మ, గంగాధరం, టీచర్లు పుష్పావతి, వరదారెడ్డి, ఫిజియోథెరపి డాక్టర్ నిరంజన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోండి
ఎమ్మెల్యే జగన్మోహన్

చిత్తూరు సిటీ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): భూసమస్యల పరిష్కారమేలక్ష్యంగా శుక్రవారం నుంచి జరగనున్న రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ ఒక ప్రకటనలో సూచించారు.

పూతలపట్టు: మండలంలోని ఎర్రచెరువుపల్లె పంచాయతీ గాండ్లపల్లెలో సదస్సు జరగనుందని తహసీల్దార్ గుర్రప్ప తెలిపారు.

బంగారుపాళ్యం: మండలంలో మహాసముద్రంలో సదస్సు జరగనుందని తహసీల్దార్ బాబురాజేంద్రప్రసాద్ తెలిపారు.

యాదమరి: మండలంలోని కుక్కలపల్లెలో సదస్సు జరుగుతుందని తహసీల్దార్ పార్థసారధి తెలిపారు.

విజయపురం: మండలంలోని పన్నూరులో సదస్సు జరుగుతుందని తహసీల్దార్ కిరణ్ తెలిపారు.

నగరి: మండలంలోని మాంగాడు పంచాయతీ కార్యాలయం వద్ద సదస్సు జరగనుందని తహసీల్దార్ రవికుమార్ తెలిపారు. అన్ని మండలాల్లో సదస్సులు జరుగుతాయని ఆర్డీవో భవానిశంకరి పేర్కొన్నారు.

సారా విక్రేతల బైండోవర్

గుడిపాల, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): సారా విక్రేతలను బైండోవర్ చేసి.. గురువారం తహసీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి ఎదుట ఎక్సైజ్ శాఖ అధికారులు హాజరుపరిచారు. సారా విక్రయించినా, తయారుచేసినా పీడీ యాక్ట్ నమోదు చేస్తామని హెచ్చరించారు.

రేషన్ బియ్యం స్వాధీనం
ఒకరిపై కేసు

శ్రీరంగరాజపురం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రేషన్ బియ్యం స్వాధీనం చేసుకుని, ఓ వ్యక్తిపై కేసు నమోదు చేశారు. ఎస్ఆర్ పురం మండలం పుల్లూరు క్రాస్ చెందిన మురుగన్ సీకేపురం గ్రామం వద్ద రేషన్ బియ్యం అక్రమంగా నిల్వ ఉంచాడన్న సమాచారం అందింది. దీంతో బుదవారం రాత్రి పోలీసులు తనిఖీ చేసి.. రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్నారు. మురుగన్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సుమన్ తెలిపారు.

వెదర్లచెరువు కాలువకు గండి
పూడ్చివేత పనుల్లో బోల్తా పడిన ట్రాక్టర్


గండిని ఇసుక బస్తాలతో పూడ్చుతున్న గ్రామస్తులు- బోల్తాపడ్డ ట్రాక్టర్

కల్లూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం నన్నూరివారిపల్లె పంచాయతీ కుమ్మరిపల్లి సమీపంలో వెదర్లచెరువు కాలువకు గురువారం గండి పడింది. సమీప గ్రామాల ప్రజలు వెంటనే చేరుకొని మరమ్మత్తులు చేపట్టారు. ట్రాక్టర్‌లో ఇసుకబస్తాలు, గుళ్లను తరలించారు. ఈ క్రమంలో గట్టుపై ఉన్న ట్రాక్టర్ ట్రాలీతోసహా ప్రమాదవశాత్తు కాలువలో బోల్తా పడింది. డ్రైవర్ చాకచక్యంగా ట్రాక్టర్‌పై నుంచి దూకేయడంతో ప్రమాదం తప్పింది. అనంతరం ఎక్స్‌కవేటర్ సాయంతో ట్రాక్టర్‌ను వెలికితీశారు.

జగన్ కనుసన్నల్లోనే
కాకినాడ పోర్టు ఆస్తుల కబ్జా: టీడీపీ


సురేంద్రకుమార్

చిత్తూరు సిటీ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం జగన్ కనుసన్నల్లోనే కాకినాడ పోర్టు ఆస్తులు కబ్జాకు గురయ్యాయని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సురేంద్ర కుమార్ ఆరోపించారు. గురువారం జిల్లా పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. జగన్ తన అధికారాన్ని అడ్డుపెట్టుకుని రాష్ట్రంలో ఏ స్థాయిలో మాఫియా పాలన చేశారో అనడానికి కాకినాడ పోర్టు అంశమే నిదర్శనమని చెప్పారు. కాకినాడ పోర్టుపై జగన్ మాఫియా కన్ను పడ్డాకే రూ.48వేల కోట్ల విలువైన పేదల బియ్యం అక్రమ రవాణా జరిగిందని చెప్పారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం కాకినాడ పోర్టు వ్యవహారంపై సీఐడీ విచారణ చేయడానికి ఆదేశాలివ్వడాన్ని ప్రజలు స్వాగతిస్తున్నారని అన్నారు.

కాంతారావుకు నివాళి

పూతలపట్టు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సీనియర్ టీడీపీ నేత, డీసీసీబీ మాజీ డైరెక్టర్, పూతలపట్టు సింగిల్ విండో అధ్యక్షుడు కాంతారావు 10రోజుల క్రితం మృతి చెందారు. గురువారం పేటఅగ్రహారం గ్రామంలో శుభస్వీకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నివాళి అర్పించారు. వీరిలో.. పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్, డీసీసీబీ మాజీ చైర్మన్ అమాస రాజశేఖర్ రెడ్డి, నేతలు యువరాజులు నాయుడు, దొరబాబు చౌదరి, గంగారపు గోపి, చంద్రమౌళి, గణపతి నాయుడు, జగన్నాథం, నాదముని ఉన్నారు.

ఎస్‌డీపీఐ అసెంబ్లీ కమిటీ నియామకం

చిత్తూరు అర్బన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): సోషియల్ డెమోక్రటిక్ పార్టీ ఆఫ్ ఇండియా(ఎస్‌డీపీఐ) చిత్తూరు అసెంబ్లీ కమిటీని ఏర్పాటు చేశారు. అధ్యక్షుడిగా ఆసీఫ్, ఉపాధ్యక్షుడిగా కరీం, ప్రధాన కార్యదర్శిగా తౌసిక్, సహాయకార్యదర్శిగా సుహైల్, కోశాధికారిగా యూసఫ్‌లతోపాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా ఫయాజ్, జిల్లా కార్యదర్శిగా సిద్ధిక్, చాన్‌బాషాలు వ్యవహరించారు.

పిల్లలకు స్వీట్లు పంపిణీ

పూతలపట్టు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): శ్రీవెంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న కడప జిల్లా సుండుపల్లికి చెందిన వంశీ అనే యువకుడు తన పుట్టిన రోజు సందర్భంగా పూతలపట్టు బాలుర హాస్టల్ వద్దకు వెళ్లి పిల్లలకు స్వీట్లు పంపిణీ చేశారు. అక్కడే కేక్ కట్‌చేశారు.

అమృత లింగేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన

చిత్తూరు కల్చరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఓబనపల్లెలో గురువారం వీరభద్ర స్వామి ఆలయంలో అమృత లింగేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చిత్తూరు మాజీ ఎమ్మెల్యే సీకే బాబు హాజరై.. స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు.

'సూర్యఘర్'ను సద్వినియోగం చేసుకోండి


ఇరువారంలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న డీఈ ప్రసాద్ తదితరులు

చిత్తూరు రూరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పీఎం సూర్యఘర్ పథకాన్ని 200 యూనిట్లు పైన విద్యుత్ వాడే వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని టౌన్ డీఈ ప్రసాద్ తెలిపారు. గురువారం ఇరువారంలోని ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో పథకానికి సంబంధించిన కరపత్రాలు పంపిణీ చేశారు.

రెవెన్యూ సదస్సులను
సద్వినియోగం చేసుకోండి

- అసిస్టెంట్ కలెక్టర్ హిమ వంశీ


మీడియాతో మాట్లాడుతున్న హిమవంశీ

చిత్తూరు రూరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు అర్బన్ మండలంలో శుక్రవారం నుంచి జరగనున్న రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని అసిస్టెంట్ కలెక్టర్ హిమవంశీ తెలిపారు. గురువారం అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. శుక్రవారం నుంచి ఈ సదస్సులు నిర్వహించనున్నట్లు చెప్పారు. సదస్సులో తహసీల్దార్, ఆర్ఐ, వీఆర్వో, దేవదాయ, వక్ఫ్‌బోర్డు, రిజిస్ట్రేషన్, అటవీ తదితర శాఖల అధికారులు హాజరవుతారన్నారు. శుక్రవారం లక్ష్మాంబపురంలో సదస్సు జరగనుందని వివరించారు. తహసీల్దార్ కళావతి తదితరులు పాల్గొన్నారు.

కవర్ల కోసం పేర్లు నమోదు చేసుకోండి

మామిడి రైతులకు సూచన

ఐరాల/తవణంపల్లె, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మామిడి కాయలకు చుట్టడానికి కవర్లు కావాల్సిన రైతులు తమ పేర్లను నమోదు చేసుకోవాలని ఉద్యాన శాఖ అధికారి సాగరిక గురువారం సూచించారు. రైతు సేవా కేంద్రంలో పేర్లు నమోదు చేసుకుంటే కవర్లు అందిస్తామన్నారు. పాసు పుస్తకం, ఆధార్ కార్డు, బ్యాంక్ అకౌంట్ జిరాక్స్‌లతో సంప్రదించాలన్నారు.